Website: www.subhatelangana.in
RNI-TELTEL/2017/72695
గురువారం
15 ఆగస్టు 2024
ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్
సంపుటి : 8
సంచిక : 101
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక
మేడ్చల్
Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar

## పొరుగు రాష్ట్రాలతో కాదు..
# ప్రపంచంతోనే మా పోటీ



- పదేండ్లలో ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను మారుస్తా
- ప్రపంచ అవసరాలు తీర్చే నాలుగో ఫ్యూచర్ సిటీగా హైదరాబాద్
- కాగ్నిజెంట్ నూతన ప్రాంగణ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్

**శుభ తెలంగాణ హైదరాబాద్**

ఒకవైపు దేశ ఆర్థిక వ్యవస్థ మూడు ట్రిలియన్ డాలర్లకు చేరుకొనేందుకు అష్టకష్టాలు పడుతూ ఉంటే.. వచ్చే పదేండ్లలో తెలంగాణను ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ. 84 లక్షల కోట్లు) ఆర్థిక వ్యవస్థగా మారుస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. అదే తన విజన్ అని అన్నారు. పద్నాలుగురోజుల విదేశీ పర్యటన నుంచి తిరిగివచ్చిన సీఎం.. ఇకపై తమ పోటీ పొరుగు రాష్ట్రాలతో కాదని ప్రపంచంతో నేనని ప్రకటించారు. కోకాపేటలో కాగ్నిజెంట్ నూతన ప్రాంగణాన్ని ముఖ్యమంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..హైదరాబాద్‌కు 430 సంవత్సరాల చరిత్ర ఉన్నదని, ఎన్ని వ్యవస్థలు మారినా ప్రతి ఒకరూ హైదరాబాద్ అభివృద్ధికి పాటుపడ్డారని అన్నారు. ప్రస్తుత ప్రపంచ అవసరాలకు తగినట్టు హైదరాబాద్‌ను నాలుగో ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనుకుంటన్నట్టు వెల్లడించారు. చైనా ప్లస్ వన్ కంట్రీ కోసం అమెరికా, సౌత్‌కోరియా తదితర దేశాలు ఎదురుచూస్తున్నాయని వాటన్నింటికి ఫ్యూచర్ సిటీ హైదరాబాద్ సమాధానం చెప్తుందని - మిగతా3లో



# సుప్రీంలో రాష్ట్ర సర్కారుకు ఊరట

- ఎమ్మెల్సీల నియామకంలో హైకోర్టు ఆదేశాలపై స్టే
- కొత్త ఎమ్మెల్సీల నియామకంపై స్టేకు నో
- అలా చేస్తే గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వ
- హక్కులను హరించినట్లేనన్న ధర్మాసనం
- గవర్నర్ కార్యదర్శి, సర్కార్‌కు నోటీసులు

**శుభ తెలంగాణ న్యూఢిల్లీ**

సుప్రీంకోర్టులో తెలంగాణ సర్కారుకు ఊరట లభించింది. ఎమ్మెల్సీలను గవర్నర్ నామినేట్ చేయడాన్ని నియంత్రించలేమని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. గవర్నర్ నిర్ణయాన్ని ఆపలేమని తెలిపింది. అయితే, ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు స్టే అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది. తుది తీర్పునకు లోబడే తదుపరి నియామకాలు ఉండాలని పేర్కొంది. పూర్వాపరాల్లోకి - మిగతా3లో



## 50 వేల కోట్ల అప్పులా...

- మార్పు అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఎప్పుడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 8 నెలల్లోనే 50 వేల కోట్ల అప్పు చేయటమేనా
- ఒక్క కొత్త ప్రాజెక్ట్ కూడా లేకుండా రూ. 50 వేల కోట్ల రూపాయలు అప్పు తేవాల్సిన అవసరమెమొచ్చింద
- రాష్ట్ర సంపద పెంచిన బీఆర్ఎస్ పై అప్పులు, అప్పులు అంటూ తప్పుడు ప్రచారం చేశారు
- అపోహలు, అర్ధ సత్యాలను ప్రచారం చేసి జనాన్ని తప్పుదోవ పట్టించారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన

## అప్పటి వరకు
# మౌనమేనా?




- గత కొన్ని నెలలుగా కేసీఆర్ సైలెంట్‌గా ఉండడం రాజకీయాల్లో హాట్ టాపిక్
- పార్లమెంట్ ఎన్నికల ప్రచారం మినహాయిస్తే ఎలాంటి కార్యక్రమాలలో ఆయన పాల్గొనలేదు
- కుమార్తె కల్వకుంట్ల కవితకు బెయిల్ వస్తే తప్ప కేసీఆర్ పొలిటికల్ స్క్రీన్‌పై మళ్లీ యాక్టివ్ కనిపించే ఛాన్స్ లేదని తెలుస్తోంది
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడినా వార్తే?. మౌనంగా ఉన్నా వార్తే
- ఉద్యమ సమయం నుంచి ఇప్పటి వరకు అదే పంథాను కొనసాగిస్తున్నారు కేసీఆర్

**శుభ తెలంగాణ హైదరాబాద్**

గులాబీ బాస్ కేసీఆర్ గత కొన్ని నెలలుగా సైలెంట్‌గా ఉండడం రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారం మినహాయిస్తే ఎలాంటి కార్యక్రమాలలో ఆయన పాల్గొనలేదు. కేసీఆర్.. మరికొన్ని రోజుల పాటు సైలెంట్‌గానే ఉండే అవకాశం కనిపిస్తోంది. కుమార్తె కల్వకుంట్ల కవితకు బెయిల్ వస్తే తప్ప కేసీఆర్ పొలిటికల్ స్క్రీన్‌పై మళ్లీ యాక్టివ్ కనిపించే ఛాన్స్ లేదని తెలుస్తోంది.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడినా వార్తే?. మౌనంగా ఉన్నా వార్తే. ఉద్యమ సమయం నుంచి ఇప్పటి వరకు అదే పంథాను కొనసాగిస్తున్నారు కేసీఆర్. తెలంగాణ ఉద్యమం సాగిన 12 ఏళ్ల పాటు కేసీఆర్ సైలెంట్‌గా ఉంటే వ్యూహాత్మక మౌనం అంటూ పెద్ద ఎత్తున వార్తలు వచ్చేవి.తెలంగాణలో రెండు విడతలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు కూడా అవసరమనుకుంటే తప్ప మీడియా ముందుకు వచ్చేందుకు కేసీఆర్ పెద్దగా ఆసక్తి చూపలేదు. అందుకే కేసీఆర్ మీడియా సమావేశాలను ఏర్పాటు చేసినా? బహిరంగ సభలో - మిగతా3లో

## నేడే మూడో విడత
# రుణమాఫీ

- కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేస్తోంది.
- ఖమ్మం జిల్లా వైరాలో రుణమాఫీకి సంబంధించిన కార్యక్రమాన్ని ప్రారంభించనున్న సీఎం
- దీంతో రూ. 1.50లక్షల నుంచి రూ. 2 లక్షల వరకు రుణమాఫీకి సంబంధించిన నగదు రైతుల ఖాతాల్లో జమ కానుంది
- జూలై 15వ తేదీన రుణమాఫీ జీఓ జారీ చేసిన ప్రభుత్వం..



**శుభ తెలంగాణ హైదరాబాద్**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం రైతులకు మూడో విడత రుణమాఫీకి సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు ఖమ్మం జిల్లా వైరాలో రుణమాఫీకి సంబంధించిన కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించనున్నారు. దీంతో రూ. 1.50లక్షల నుంచి రూ. 2 లక్షల వరకు రుణమాఫీకి సంబంధించిన నగదు రైతుల ఖాతాల్లో - మిగతా3లో



## ఏపీ, తెలంగాణ సహా ఆ రాష్ట్రాలకు వర్ష సూచన

- రానున్న 24 గంటల్లో 17 రాష్ట్రాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపిన ఐఎండీ
- ఢిల్లీలో ఇవాళ, రేపు కూడా భారీ వర్షాలు
- ఆగస్టు 18వరకూ హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ లలో భారీ వర్షాలు



# కోల్‌కత్తా రేప్ కేసులో విస్తుపోయే నిజాలు




**బెంగాల్ :** కోల్‌కతా రేప్ కేస్.. ఇప్పుడు దేశవ్యాప్తంగా దీని గురించే చర్చించుకుంటున్నారు. చర్చించాలి కూడా.. ఎందుకంటే అత్యంత దారుణమైన ఘటన ఇది. ఓ ట్రైనీ డాక్టర్‌ను అత్యంత అమానుషంగా రేప్ చేసి చంపడం. అమానుషమంటే మాములుగా కాదు. చిత్రవధ చేసి.. అత్యంత తీవ్రంగా హింసించి చంపడం. అది కూడా హస్పిటల్‌లోనే ఈ దారుణం జరగడం. ఈ ఘటన ఓ రకంగా మేలుకొలుపు లాంటిది. మనుషుల్లో ఉన్న మృగాళ్ల విషయంలో ఎంత జాగ్రత్తగా ఉండాలో తెలిపే ఘటన ఇది.కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్. ఆగస్టు 9 తెల్లవారుజామున 3 గంటల నుంచి 5 గంటల మధ్య జరిగింది ఈ ఘటన. సెమినార్ హాల్‌లో చదువుకుకొని అక్కడే నిద్రిస్తుంది ఓ ట్రైనీ డాక్టర్.ఆ సమయంలో అటువైపు వచ్చాడు సంజయ్ రాయ్ అనే నరరూప రాక్షసుడు. నిద్రిస్తున్న ఆ ట్రైనీ డాక్టర్‌పై తన ప్రతాపాన్ని చూపాడు. ఆమెను చిత్రవధ చేసి అత్యాచారం చేసి చంపాడు. తెల్లారిన తర్వాత కానీ ఆమె చనిపోయిన విషయాన్ని ఎవరూగుర్తించలేదు. ఈ ఘటన తర్వాత కోల్‌కతా మాత్రమే కాదు. బెంగాల్ మొత్తం అట్టుడికి పోయింది. నాట్ ఓన్లీ బెంగాల్ మొత్తం దేశమే ఈ ఘటన గురించి తెలుసుకొని షాక్ అయ్యింది.మృతురాలి అటాప్సీ రిపోర్ట్ చూస్తే మైండ్ బ్లాక్ అవ్వడం ఖాయం. నాలుగు పేజీల రిపోర్ట్‌లో ఒక్కొక్క లైన్ చదువుతుంటే ఒళ్లు గగుర్పాటుకు గురైందంటున్నారు పోలీసులు. ఒక్కొక్క విషయం చూస్తుంటే అసలు వాడు మనిషేనా? అనిపిస్తుంది. నిజానికి ఇది చెప్పడం భావ్యం కాదు. కానీ మనుషుల్లో పైశాచిక ప్రవర్తన ఎలా ఉంటుందో ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి కాబట్టి చెబుతున్నాం. మృతురాలి మెడ విరిగిపోయింది. కడుపు, పెదవులు, చేతి వేళ్లు, ఎడమ కాలిపై తీవ్ర గాయాలయయ్యాయి.ఆమె అరిస్తే ఎక్కడ దొరికిపోతానన్న భయంతో.. ఆమెను గోడకేసి గట్టిగా నొక్కి పట్టి.. ఆమె ముక్కు, గొంతును గట్టిగా బిగించిపట్టుకున్నాడు. ముఖాన్ని గోడకేసి గట్టిగా కొట్టాడు. ఈ టైమ్‌లో ఆమె మొఖంపై కూడా గాయాలయ్యాయి. ఆఖరికి కళ్లపై కూడా గాయాలున్నాయి. ఇక ప్రైవేట్ పార్ట్స్, కళ్లు, గొంతు నుంచి కూడా రక్తస్రావమైంది. ఇవన్నీ చెబుతున్న మాకైతే రక్తం మరిగిపోతుంది. అసలు వాడు మనిషేనా? అని మీకు అనాలనిపిస్తుందా? ఇంకో దారుణమైన విషయం ఏంటంటే.. ఆమె చనిపోయిన తర్వాత కూడా అత్యాచారం చేసినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇవన్నీ విన్న తర్వాత ఆ అమ్మాయిని ఇంత చిత్రవధ చేసి చంపిన వాడు దొరికితే ఏదో ఒకటి చేయాలనిపిస్తుంది కదా? ఈ విషయాలన్నీ తెలుసుకున్నారు కాబట్టే.. కోల్‌కతాలో రగులుకున్న జ్వాలలు ఇంకా చల్లారడం లేదు.దారుణాలకు పాల్పడింది సంజయ్‌రాయ్ అని ప్రాథమికంగా నిర్ధారించారు పోలీసులు. అయితే ఈ దారుణంలో ఉన్నది రాయ్ ఒక్కడేనా..? లేక ఇంకేవరైనా ఉన్నారా? అనే విషయంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఓ బ్లూ టూత్ హెడ్‌సెట్ కారణంగా సంజయ్ రాయ్ దొరికాడు. హాస్పిటల్‌కు వచ్చేప్పుడు అతని మెడలో ఉన్న బ్లూటూత్ హెడ్‌సెట్.. వెళ్లేప్పుడు లేదు. దీంతో పోలీసులకు అనుమానం వచ్చింది. అతని ఇంటికి వెళ్లి తనిఖీలు చేసిన పోలీసులు రక్తపు మరకలు ఉన్న బట్టలను పిండినట్టు గుర్తించారు. అంతేకాదు అతని షూస్‌పై ఉన్న రక్తపు మరకలు మాత్రం అలానే ఉన్నాయి. ఆ బట్టలు పిండటం కూడా వెంటనే చేయలేదు. ఇంత దారుణం చేశాక ఇంటికి వెళ్లి హాయిగా పడుకున్నాడు. ఆ తర్వాత నిద్రలేచి బట్టలు పిండే సమయానికి పోలీసులు అక్కడికి చేరుకున్నారు.అసలింతకు ఎవరీ సంజయ్ రాయ్? అసలు హాస్పిటల్‌లో అతనికేం పని? సంజయ్ రాయ్ అనేవాడు ఓ కాంట్రాక్ట్ ఎంప్లాయి. అంతకుముందు ట్రాఫిక్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో వాలంటీర్‌గా చేశాడు. ఆ తర్వాత కోల్‌కతా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో సివిల్ వాలంటీర్‌గా చేశాడు. ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజ్ వద్ద ఉన్న పోలీస్ ఔట్‌పోస్ట్‌లో పనిచేసేవాడు. మనోడు రెగ్యులర్ పోలీస్ కాకపోయినా.. పరపతి మాత్రం మాములుగా లేదని తెలుస్తుంది. ఇదే వాడి పని. ఇక పర్సనల్ విషయానికి వస్తే.. సంజయ్‌కు నాలుగు పెళ్లిళ్లు అయ్యాయి. ముగ్గురు భార్యలు వీడితో వేగలేమని వదిలేశారు. నాలుగో భార్య.. క్యాన్సర్‌తో చనిపోయింది.పోలీసులు అరెస్ట్ చేసి ఇన్వెస్టిగేషన్ స్టార్ట్ చేయగానే మొత్తం కక్కేశాడు. ఈ దారుణానికి పాల్పడింది నేనే.. కావాలంటే ఉరి తీసుకొండి అని చెబుతున్నాడు. అంతేకానీ.. చేసిన పనికి ఏమాత్రం పశ్చాతాపం పడటం లేదు. అంతేకాదు.. విచారణలో భాగంగా అతడి ఫోన్‌ను సీజ్ చేసి పరిశీలించిన పోలీసుల దిమ్మ తిరిగిపోయింది. ఫోన్ నిండా పోర్న్ వీడియోసే ఉన్నాయని గుర్తించారు. అంతేకాదు.. సంజయ్ పెద్ద అని తేల్చారు.సంజయ్ ఏళ్లుగా అక్కడే పని చేస్తున్నాడు. అందరి మధ్య మంచితనం ముసుగేసుకొని చక్కర్లు కొట్టాడు. అతనిలో ఉన్న ఈ మృగవాంఛను ఎవరూ గుర్తించకుండా జాగ్రత్త పడ్డాడు. అదునుచూసి అత్యంత పైశాచికంగా దాడి చేశాడు. ఇలాంటి వారు మన మధ్య కూడా తిరుగుతుంటారు. సో కాస్త జాగ్రత్తగా ఉండటం చాలా మంచిది. ఇక హాస్పిటల్‌లోనే ఇలాంటి ఘటన జరగడం.. అక్కడి సెక్యూరిటీ అంశాలపై కూడా కొత్త డౌట్స్‌ను రేకెత్తించింది.కోల్ కతా లాంటి మహానగరంలో అంతమంది అంటే.. రోగులు, డాక్టర్లు, మెడికల్ కాలేజ్ స్టూడెంట్స్.. ఇలా వందలాది మంది తిరిగే చోటున ఇలాంటి ఘటన జరగడం అత్యంత దారుణమనే చెప్పాలి. పనిచేసే చోట.. ఉండే చోట.. ఎక్కడా రక్షణ లేకపోతే ఎలా అని ప్రశ్నిస్తూ పోరాటం చేస్తున్నారు డాక్టర్లు, నర్సులు. మరి వారికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఒక్క మమతా బెనర్జీ సర్కార్‌కే కాదు.. దేశవ్యాప్తంగా ఉన్న పాలకులందరికీ ఉంది. ఇప్పటికే ఈ కేసు విచారణను సీబీఐకు అప్పగించింది కోల్ కతా హైకోర్టు. మూడు వారాల్లో నివేదిక ఇవ్వాలంది. విచారణ సంగతి పక్కన పెడితే.. ఇలాంటి ఘటన మన మధ్య జరగదన్న గ్యారెంటీ అయితే లేదు. సో.. అమ్మాయిలూ.. ఆల్వేస్ బీ కేర్ ఫుల్.

# విదేశాలకు వందే భారత్



**చెన్నై :** మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైల్వేలో భారీ మార్పులు సంభవించాయి. దాదాపు దేశంలోని ప్రధాన పట్టణాలకు మూడో లైన్ వేయడంతో పాటు గూడ్స్ అండ్ ప్యాసింజర్ లాంటి రైళ్లు ఎక్కడా ఆగకుండా పరుగులు తీస్తున్నాయి. దీంతో ప్రయాణికుల రవాణాతో పాటు వాణిజ్యం కూడా పెరుగుతోంది. రైల్వేలో ఇప్పటికే వందే భారత్ లాంటి అన్ని వసతులతో కూడిన రైళ్లు ప్రధాన పట్టణాలకు పరుగులు తీయడమే కాకుండా.. దగ్గరి, దగ్గరి ప్రాంతాలకు వందే భారత్ మెట్రో వస్తోంది. వీటిని విజయవంతం పరీక్షించిన అధికారులు ప్రధాన పట్టణాల్లో నడిపేందుకు సిద్ధం చేస్తున్నారు. అయితే వీటిని ఎగుమతి చేయాలని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ నిర్ణయించింది. సమీప భవిష్యత్తులో తన ఆదాయానికి రక్షణ కల్పించుకోవడంతో పాటు రైలు, మెట్రో విభాగం అత్యంత ముఖ్యమైన సహకారాన్ని అందజేస్తుందని అంచనా వేస్తోంది. రాబోయే కొన్నేళ్లలో వందే భారత్, వందే భారత్ మెట్రో రైళ్ల ఎగుమతి ఆర్డర్‌లను పొందాలని కంపెనీ ఆ దిశగా అడుగులు వేస్తోంది. బీఈఎంఎల్ ఛైర్మన్ శంతను రాయ్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'మొదట స్వదేశీ వందే భారత్ రైళ్లను ప్రారంభించడమే ప్రాధాన్యత. కానీ వచ్చే ఏడాది, మేము ఎగుమతి విషయంలో ఏదైనా ఆశించాలని అనుకుంటున్నాము. బీఈఎంఎల్ ప్రస్తుతం భారతీయ రైల్వేల కోసం వందే భారత్ స్లీపర్ రైలు సెట్ మొదటి నమూనాను తయారు చేస్తోంది. ఇది రాబోయే నెలల్లో విడుదల అవుతుందని బీఈఎంఎల్ తెలిపింది. మేక్ ఇన్ ఇండియా చొరవను వేగవంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నం. ప్రస్తుతం మధ్యప్రాచ్యం, దక్షిణ అమెరికా, ఆసియా ప్రాంతంలో రైలు, మెట్రో ఎగుమతుల కోసం అవకాశాలను అన్వేషిస్తోంది' అని రాయ్ చెప్పారు.వారి టాప్ లైన్‌లో దాదాపు 10% వరకు. వృద్ధిని క్రమబద్ధీకరించడానికి, బీఈఎంఎల్ ఈ ఆర్థిక సంవత్సరంలో తన కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరించింది. మైనింగ్, నిర్మాణం, రక్షణ, రైల్వే, మెట్రో అనే మూడు కీలక విభాగాలపై దృష్టి సారించింది. కంపెనీ ఈ విభాగాల్లో 11 వ్యూహాత్మక వ్యాపార యూనిట్లను (రాఃజ) ఏర్పాటు చేసింది, ప్రతి ఒక్కటి అఖా నేతృత్వంలో ఎక్కువ నిర్ణయాధికారం, కార్యకలాపాలపై మెరుగైన నియంత్రణను కలిగి ఉంటుంది. జూన్ 30, 2024తో ముగిసిన త్రైమాసికంలో బీఈఎంఎల్ ఏకీకృత నికర నష్టం రూ. 70 కోట్లకు తగ్గింది, అయితే కంపెనీ టాప్‌లైన్‌లో 10 శాతం వృద్ధిని సాధించింది.లాభదాయకతకు సంబంధించి, గత సంవత్సరం పని తీరు గత సంవత్సరాల కంటే మెరుగ్గా ఉందని రాయ్ పేర్కొన్నారు. 'ఈ సంవత్సరం, మేము ఎబిటెడ్ వృద్ధికి 13 శాతం వద్ద 100 బేసిస్ పాయింట్లు ఇచ్చాం. సమీప భవిష్యత్తులో 16 శాతం నుంచి 17 శాతానికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని ఆయన చెప్పారు. బీఈఎంఎల్ దాని భవిష్యత్తు అవకాశాల గురించి ఆశాజనకంగా ఉంది. రైలు, మెట్రో మరియు రక్షణ రంగాల్లో తన లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేస్తోంది.

# ఇజ్రాయెల్‌కు అమెరికా మరోసారి భారీ సాయం




పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు కమ్ముకున్న వేళ తాజాగా అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఇజ్రాయెల్‌కు 20 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధ విక్రయాల ఒప్పందానికి అమెరికా ఆమోదం తెలిపింది. అందులో అనేక ఫైటర్ జెట్లు, 50పైగా ఎఫ్-15 ఫైటర్ జెట్స్, అధునాతన ఎయిర్-టు-ఎయిర్ క్షిపణులు, 120 ఎంఎం ట్యాంక్ మందుగుండు సామగ్రి, అధిక పేలుడు మోర్టార్లు ఉన్నాయి. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ ప్రకటన విడుదల చేసింది. అయితే, ఈ ఆయుధాలన్నీ ఎప్పుడు ఇజ్రాయెల్ కు చేరుకుంటాయనేది తెలియలేదు. వీటన్నింటినీ ఇజ్రాయెల్ కు అప్పగించడానికి కొన్నేళ్లు పట్టనున్నట్లు సమాచారం. అమెరికా ఇవ్వనున్న ఈ ఆయుధాలు ఇజ్రాయెల్ సైనిక సామర్థ్యాన్ని దీర్ఘకాలికంగా పెంచుకోవడానికి సాయపడనుంది. కాగా, ఇజ్రాయెల్ పై ప్రతీకార కాంక్షతో రగిలిపోతున్న ఇరాన్, దాడికి సిద్ధమైనట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ ఆయుధ విక్రయ ఒప్పందానికి యూఎస్ ఆమోదించడం గమనార్హం.

## ఏపీ, తెలంగాణ సహా ఆ రాష్ట్రాలకు వర్ష సూచన



నైరుతి రుతుపవనాలు చురుగ్గా ఉన్న క్రమంలో ఈ నెలలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఐఎండీ ఢిల్లీ సహా 17 రాష్ట్రాలకు వర్ష సూచనలు చేసింది. ఢిల్లీ పరసరాల్లో నిన్న జోరుగా వర్షం కురిసింది. ఇవాళ, రేపు కూడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆలానే రానున్న 24 గంటల్లో ఢిల్లీ, చండీగఢ్, హర్యానా, పంజాబ్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్ గఢ్, బీహార్, జార?ండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఉత్తరాఖండ్, గుజరాజ్, లక్షద్వీప్, అండమాన్ నికోబార్ దీవులలో మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది.

**రేపు ఈ రాష్ట్రాల్లో భారీ వర్షాలు**

ఆగస్టు 15న కర్ణాటక, కేరళ, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, జార?ండ్, అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, ఒడిశా, బీహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, జమ్ము, హర్యానా, చత్తీస్ గఢ్, ఢిల్లీలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. కేరళ, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆగస్టు 18వరకూ హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ లలో భారీ వర్షాలు ఉంటాయని ఐఎండీ అంచనా వేసింది. ఆగస్టు 16వరకూ హర్యానాలో వర్షాలు కురుస్తాయని తెలిపింది.

## వేణుస్వామి అడ్డంగా ఇరుక్కున్నాడే



**హైదరాబాద్:** జ్యోతిష్యం పేరుతో సెలెబ్రిటీలపై ఇష్టమొచ్చినట్టు వ్యాఖ్యలు చేస్తూ ఎల్లప్పుడూ వివాదాల్లో ఉండే వేణు స్వామి, రీసెంట్ నాగ చైతన్య ? శోభిత నిశ్చితార్థం చేసుకున్న సందర్భంగా వారి జాతకం చెప్తూ, మరో మూడేళ్ళలో వీళ్ళు ఒక స్త్రీ కారణంగా విడిపోతారు అంటూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్రమైన వివాదాలకు దారి తీసింది. ఇంతకు ఇలాంటి కామెంట్స్ ఆయన ఎన్ని చేసినా కూడా సమస్యల్లో చిక్కుకోలేదు. కానీ ఈసారి మాత్రం వేణు స్వామి కి చాలా పెద్ద దెబ్బ తగిలేలా ఉంది. ఆయనకి మహిళా కమిషన్ నుండి ఉత్తర్వులు వచ్చాయి.కొత్తగా నిశ్చితార్థం చేసుకున్న అమ్మాయి పట్ల అనుచితంగా, ఆమె అనుమతి లేకుండా జాతకం చెప్పడమే కాకుండా, ఆమె మనస్సు నొచ్చుకునేలా అలాంటి వ్యాఖ్యలు ఎందుకు చెప్పారో ఈ నెల 22 వ తారీఖున కమిషన్ కి వచ్చి వివరణ ఇవ్వాలని, లేనిచో చట్టపరమైన చర్యల కోసం ముందుకు పోతాము అంటూ ఉత్తర్వులు జారీ చేసారు. తెలుగు ఫిలిం జర్నలిస్ట్ అసోసియేషన్ రీసెంట్ గానే వేణు స్వామి చేసిన ఈ కామెంట్స్ పై మహిళా కమిషన్ కి ఫిర్యాదు చెయ్యగా, నేడు ఈ కార్యాచరణ జరిగింది. ఒకవేళ వేణు స్వామి కమిషన్ కి హాజరై వివరణ ఇవ్వకపోతే చట్టపరమైన చర్యలకు వాళ్ళు సిద్ధమైతే వేణు స్వామి అరెస్ట్ కాబోతున్నాడా? అంటే అవుననే చెప్పొచ్చు. ఎందుకంటే ఒకరి వ్యక్తిగత జాతకాలు వారి అనుమతి లేకుండా, పబ్లిసిటీ కోసం ఇష్టమొచ్చినట్టు వ్యాఖ్యలు చెయ్యడం ముమ్మాటికీ చట్టరీత్యా నేరమే. ఇకపోతే కాసేపటి క్రితమే వేణు స్వామి ని సమర్థిస్తూ ఆయన సతీమణి వీణ శ్రీవాణి ఒక వీడియో విడుదల చేసిన సంగతి అందరికీ తెలిసిందే. నిన్న మొన్నటి వరకు ఈమెపై సోషల్ మీడియా లో ఉన్న నెటిజెన్స్ కి ఎంతో గౌరవం ఉండేది. ఎందుకంటే ఈమె గొప్ప సంగీత కళాకారిణి.లైవ్ గా ఈమె చేసే సంగీత ప్రదర్శనలకు ప్రపంచవ్యాప్తంగ్గా లక్షలాది మంది అభిమానులు ఉన్నారు. అంతే కాదు ఈమె అనేక టాలీవుడ్ ప్రీ రిలీజ్ ఈవెంట్స్ లో కూడా లైవ్ మ్యూజిక్ పెర్ఫార్మన్స్ ఇచ్చింది. అందులో పవన్ కళ్యాణ్ ? త్రివిక్రమ్ కాంబినేషన్ లో వచ్చిన అజ్ఞాతవాసి మూవీ ప్రీ రిలీజ్ ఫంక్షన్ కూడా ఉంది. అమాయకంగా కనిపించే ఈమె ఇంత మాట్లాడగలదా అని నేడు ఆమె విడుదల చేసిన వీడియో బైట్ ని చూసి ఆశ్చర్యపోతున్నారు నెటిజెన్స్. ఇదంతా పక్కన పెడితే వేణు స్వామి ఈ ఎన్నికలలో జగన్ ఓడిపోయిన వెంటనే ఇక సెలెబ్రెటీలకు జాతకాలు చెప్పను అంటూ, మళ్ళీ నాగ చైతన్య జాతకం చెప్పాడు. ఇప్పుడు మళ్ళీ ఆయన సెలెబ్రిటీల జోలికి రాను అంటుంటే ఎవ్వరూ నమ్మడం లేదు. ఆయన అసలు మారాడని, ఒక్కసారి ఆయన్ని అరెస్ట్ చేస్తే కానీ బుద్ధి రాదంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ పెద్ద ఎత్తున పోస్టులు పెడుతున్నారు. మరి వేణు స్వామి అరెస్ట్ అవుతాడా లేదా అనేది చూడాలి

## దువ్వాడ ఎపిసోడ్‌లో రాజకీయ వ్యూహం



**శ్రీకాకుళం :** శ్రీకాకుళం జిల్లాలో ప్రముఖ రాజకీయ కుటుంబాల్లో దువ్వాడ కుటుంబం ఒకటి. వాస్తవానికి దువ్వాడ శ్రీనివాస్ తండ్రివైపు నుంచి ఎవరికీ రాజకీయ నేపథ్యం లేదంటున్నారు. ఆయన తండ్రి సాధారణ రైల్వే ఉద్యోగి. ఇదే సమయంలో ఆయన అత్తింటి వారు తొలి నుంచి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ఇక వాణిని వివాహం చేసుకున్నాకే దువ్వాడ రాజకీయాల్లోకి వచ్చారు. జిల్లాలో కీలక నేత అయిన దివంగత కింజరాపు ఎర్రన్నాయుడి కుటుంబానికి తొలి నుంచి ప్రత్యర్థిగా దువ్వాడ మామ సంపతిరావు రాఘవరావు రాజకీయాలు చేస్తూ వచ్చారు.ఎర్రన్నాయుడు ఎమ్మెల్యేగా పోటీ చేసిన తొలి ఎన్నిక తప్పితే ఆ తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లోనూ దువ్వాడ మామ సంపతిరావు రాఘవరావే ఆయనకు ప్రత్యర్థి. ఇక దువ్వాడ వాణి సైతం 2004లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఇలా దువ్వాడ కుటుంబం నుంచి ఆయన మామ, భార్య, తప్పితే దువ్వాడ శ్రీనివాసే కింజరాపు కుటుంబానికి రాజకీయ ప్రత్యర్థులుగా పోరాడారు. ఐతే గత ఎన్నికల ముందు టెక్కలి రేసులో దువ్వాడ కుటుంబం నుంచి కాకుండా మరొకరిని పోటీకి దింపాలని వైసీపీ అధిష్టానం భావించిందట? ఇక్కడే అసలు రాజకీయం మొదలై? కుటుంబంలో చిచ్చుకు కారణమైందని చెబుతున్నారు.2019లో శ్రీకాకుళం ఎంపీగా పోటీ చేసి ఓడిన దువ్వాడ శ్రీనివాస్‌కు ఎమ్మెల్సీగా అవకాశమిచ్చారు ఆ పార్టీ అధినేత జగన్. ఇక 2019లో టెక్కలి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన పేరాడ తిలక్‌ను గత ఎన్నికలకు ఎంపీగా పోటీకి నిలిపారు. దీంతో టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎవరిని నిలపాలని వైసీపీలో చర్చ జరిగిందని చెబుతున్నారు. ఆ సమయంలో దువ్వాడ ఇన్‌చార్జిగా ఉండటం వల్ల? ఆయన భార్య వాణి పోటీ చేయాలని భావించారట. ఐతే దువ్వాడ మాత్రం అప్పటికే తనకు సన్నిహితంగా ఉంటున్న మాధురిని తెరపైకి తేవాలని ప్రతిపాదించారని అంటున్నారు. దీంతో అప్పటివరకు మాధురి పట్ల కాస్త మెతక వైఖరితో వ్యవహరించిన దువ్వాడ వాణికి అనుమానం మొదలైనట్లు చెబుతున్నారు. తన తండ్రి రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తున్న వాణి? భర్త సహకారంతో తన పిల్లలకు ఆ వారసత్వాన్ని అప్పగించాలని భావిస్తే? హఠాత్తుగా వేరే మహిళ తమ కుటుంబంలో చొరబడి ఏకంగా రాజకీయంగా కీలకమవ్వడాన్ని వాణి తట్టుకోలేకపోయారంటున్నారు.దీంతో పార్టీ ప్రతిపాదనకు తన భర్త ఆలోచన తోడైతే? తమ కుటుంబ రాజకీయమే ప్రమాదంలో పడుతుందనే ఆందోళనతో వాణి అప్పటి సీఎం జగన్‌ను కలిసి తానే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని, అవకాశం ఇవ్వాలని ప్రతిపాదించినట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో దువ్వాడ బదులుగా వేరొకరికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని ఆలోచనలో ఉన్న జగన్? అప్పటికప్పుడు వాణిని ఇన్‌చార్జిగా నియమిస్తున్నట్లు ప్రకటించారంటున్నారు.అధినేత ఆశీస్సులతో ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించిన వాణి? ఎమ్మెల్యేగా పోటీకి సిద్ధమవగా, ఎన్నికల సమయంలో దువ్వాడ వ్యూహాత్మకంగా పావులు కదిపి టికెట్ సాధించుకున్నారంటున్నారు. దీంతో ఇండిపెండెంట్‌గా పోటీకి దిగాలని వాణి సిద్ధపడగా, కుటుంబ కలహాలు బయటపడితే? ఎన్నికల్లో ప్రభావం చూపుతుందనే ఆలోచన చేసిన ఎమ్మెల్సీ దువ్వాడ తన భార్యకు ఆస్తులను రాసిచ్చి బుజ్జగించినట్లు చెబుతున్నారు. భర్త పేరిట ఉన్న ఆస్తులు, కంపెనీలు తన చేతికి రావడంతో ఎన్నికల సమయంలో శాంతించిన వాణి?. ఎన్నికల ప్రచారంలో మాధురి యాక్టివ్ అవ్వడమే కాకుండా? తానే సర్వం అన్నట్లు ఎలక్షనీరింగ్ చేయడంతో వాణి రగిలిపోయినట్లు చెబుతున్నారు. ఇక ఎన్నికల తర్వాత కూడా టెక్కలి కేంద్రంగా దువ్వాడ, ఆయన స్నేహితురాలు రాజకీయాలు చేయాలని భావించడాన్ని భరించలేకపోయిన వాణి? కుమార్తెలతో కలిసి వివాదానికి దిగినట్లు చెబుతున్నారు.ఎన్నికల ముందు ఆస్తులు రాసిచ్చినా?. రాజకీయంగా పిల్లలకు నష్టం జరగకూడదనే ఉద్దేశంతోనే దువ్వాడ ప్రస్తుతం నివాసం ఉన్న ఇంట్లోకి వెళ్లాలని వాణితోపాటు కుమార్తెలు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. తాము ఆ ఇంట్లో ఉంటే మాధురి అక్కడికి రాదని? ఆ విధంగా తమ కుటుంబ రాజకీయ మనుగడకు ముప్పు లేకుండా కాపాడుకోవాలని వాణి నిర్ణయించినట్లు సమాచారం. ఇదే సమయంలో తాను భర్తను నేరుగా ఢీకొట్టి? ఇన్నాళ్లు తెరచాటుగా కొనసాగిన వ్యవహారాన్ని బయటకు లాగడం ద్వారా దువ్వాడ, ఆయన స్నేహితురాలిని రాజకీయంగా తొక్కేయడమూ వాణి ఆలోచనేనంటున్నారు. అంతిమంగా దువ్వాడ తమ దారికి వస్తే సరేసరి లేదంటే ఆయనను దోషిగా నిలిపి?. రాజకీయంగా దెబ్బతీయడమే వాణి వ్యూహమంటున్నారు. ఇందుకోసం కుటుంబంలో అందరి సహకారం తీసుకున్నట్లు చెబుతున్నారు. మొత్తానికి జడ్పీటీసీ వాణి రాజకీయ వ్యూహంతోనే మొత్తం ఎపిసోడ్‌ను నడిపిందని అంటున్నారు

==================

# సుప్రీంలో రాష్ట్ర సర్కారుకు ఊరట

-మొదటిపేజీ తరువాయి

వెళ్తే.. కేసీఆర్ హయాంలో మంత్రివర్గం గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణ పేర్లను ప్రతిపాదిస్తూ గవర్నర్‌కు సిఫారసు చేసింది. ఆ జాబితాలో ఉన్న వారికి రాజకీయ నేపథ్యం ఉందంటూ అప్పటి గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ గత ఏడాది సెప్టెంబరు 19న తిరస్కరించారు. గవర్నర్ ఉత్తర్వులను దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ వేర్వేరుగా హైకోర్టులో సవాల్ చేశారు. ఆ తర్వాత తెలంగాణలో రేవంత్‌రెడ్డి సర్కారు కొలువుదీరింది. ఈ ఏడాది జనవరి 13న కోదండరాం, ఆమిర్ అలీఖాన్‌ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించాలని సిఫారసు చేసింది. దీన్ని గవర్నర్ వెంటనే ఆమోదించడంతో జనవరి 27న గెజిట్ నోటిఫికేషన్ జారీ అయ్యింది. అయితే.. తాము వేసిన పిటిషన్లపై విచారణ జరుగుతుండగానే గవర్నర్ మరో ఇద్దరిని తన కోటాలో ఎమ్మెల్సీలుగా ఎలా నియమిస్తారని సవాల్ చేస్తూ దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలను విన్న హైకోర్టు సీజే ధర్మాసనం.. మార్చి 17న తీర్పును వెలువరించింది. దాసోజు, సత్యనారాయణ నామినేషన్లను తిరసరిస్తూ గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు తీర్పులో వెల్లడించింది. కోదండరాం, అలీఖాన్ నియామకానికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దుచేసింది. ఆ తర్వాత మంత్రివర్గం మరోమారు ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కోదండరాం, అలీఖాన్ పేర్లను సిఫారసు చేసింది. దీంతో.. తమకు న్యాయం చేయాలంటూ దాసోజు, సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ఎమ్మెల్సీలను నియమించకుండా స్టేటస్‌కో విధించాలని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబ్బల్ కోరగా, ధర్మాసనం అందుకు నిరాకరించింది. కోర్టు తుది ఆదేశాలు ఇచ్చే వరకూ హైకోర్టు ఆదేశాలపై స్టేటస్‌కో ఇవ్వాలని కపిల్ సిబ్బల్ విజ్ఞప్తిచేశారు. ధర్మాసనం హైకోర్టు తీర్పుపై స్టే ఇస్తామని చెప్పడంపై సిబ్బల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. అలా స్టే ఇవ్వడం వల్ల మళ్లీ కొత్త నియామకాలు చేపట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. పిటిషనర్లను కాకుండా గవర్నర్ వేరే వారిని నియమించే అవకాశం ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిఫారసు చేసిన ఇద్దరు వ్యక్తుల నియామక గెజిట్‌ను కూడా హైకోర్టు రద్దు చేసిందని గుర్తు చేశారు. దీనికి జస్టిస్ విక్రమ్‌నాథ్ అంగీకరించలేదు. “మీరు పట్టుబడుతున్నారు కాబట్టి.. యథాతథ స్థితిని కొనసాగించాలా? ఎవరి ద్వారా?” అని జస్టిస్ విక్రమ్‌నాథ్ ప్రశ్నించగా.. గవర్నర్ ద్వా రా అని సిబ్బల్ సమాధానమిచ్చారు. హైకోర్టు తీర్పునకు పిటిషనర్ వ్యతిరేకం కాబట్టి.. స్టే ఇస్తామని జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పష్టం చేశారు. ఈ కేసులో తుదితీర్పు వచ్చేవరకు హైకోర్టు తీర్పుపై స్టే ఉం టుందని తేల్చిచెప్పారు. సిబ్బల్ మరోమారు కలుగజేసుకుంటూ.. గవర్నర్ మళ్లీ నియామకాలు చేపట్టే అవకాశముందన్నారు. దాన్ని తాము ఆపలేమని ధర్మాసనం వివరించింది. ప్రతివాదులైన రాష్ట్ర ప్రభు త్వం, గవర్నర్ కార్యదర్శికి నోటీసులు జారీ చేసిన ధర్మాసనం.. 4 వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. విచారణను వాయిదా వేసింది.

## పొరుగు రాష్ట్రాలతో కాదు.. ప్రపంచంతోనే మా పోటీ

-మొదటిపేజీ తరువాయి

అన్నారు. తమ పర్యటనల ద్వారా రాష్ట్రానికి రూ.31,500 కోట్ల పెట్టుబడులు తెచ్చామని, 30,750కి పైగా ఉద్యోగాలు లభించనున్నాయని సీఎం తెలిపారు. త్వరలోనే మరిన్ని ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్టు చెప్పారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ప్రపంచంలో ప్రతి ఒకరూ హైదరాబాద్ గురించే మాట్లాడుతున్నారని అన్నారు. ఒక రోజులోనే ఇకడ ఐటీ రంగం అభివృద్ధి చెందలేదని, 1992లో ప్రారంభమైన ఐటీ పరిశ్రమను ఎంతో మంది ముఖ్యమంత్రులు అభివృద్ధి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా కాగ్నిజెంట్ అమెరికన్ ప్రెసిడెంట్ సూర్యగుమ్మడి మాట్లాడుతూ.. తమ నెట్‌వర్క్‌లో హైదరాబాద్ కీలకమైన హబ్ అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా కాగ్నిజెంట్‌కు 3.46 లక్షల మంది ఉద్యోగులు ఉంటే అందులో భారతదేశంలోనే 2.40 లక్షల మంది, వారిలో 57వేల మంది హైదరాబాద్‌లోనే ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేశ్‌రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి వేముల శ్రీనివాసులు, కాగ్నిజెంట్ ప్రతినిధులు క్యాథీ, జాన్‌కిమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆఫ్ క్యాంపస్ అనుమతులను పునఃసమీక్షించండి

**ఏదో ఒక కారణం చెప్పి తిరస్కరించడం చెల్లదు**

**చట్ట ప్రకారం సరైన నిర్ణయం తీసుకోవాలి**

**రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**



**హైదరాబాద్ :** ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలలో ఆఫ్ క్యాంపస్ అడ్మిషన్లకు అనుమతినిచ్చే విషయమై పునఃసమీక్షించి తగిన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. చట్టంలోని అన్ని అంశాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని తెలిపింది. ఆఫ్ క్యాం పస్ అడ్మిషన్లకు ప్రభుత్వం అనుమతి నిరాకరించడాన్ని సమర్థిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ ఎన్ రాజేశ్వరరావుతో కూడిన ధర్మాస నం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆఫ్ క్యాంపస్‌లో బీటెక్ కోర్సుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతించకపోవడాన్ని సమర్థి స్తూ సింగిల్ జడ్జి గతంలో తీర్పు చెప్పారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ, వాహిని ఎడ్యుకేషనల్ ట్రస్ట్, స్వామి వివేకానంద ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కాలేజీలు అప్పీళ్లు దాఖలు చేశాయి. వీటిపై బుధవారం జరిగిన విచారణ సందర్భంగా పిటిషనర్ల తరఫున సీనియర్ అడ్వకేట్లు దేశా య్ ప్రకాశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్, దాని అనుబంధ కోర్సులు, డాటాసైన్స్, ఏఐఎంఎల్ తదితర కోర్సులను సెల్ఫ్ ఫైనాన్స్ కింద నిర్వహించుకోవడానికి ఏఐసీటీఈ అనుమతి మం జూరు చేసిందని, ప్రభుత్వం మాత్రం నిరాకరిస్తున్నదని తెలిపారు. దీంతో కౌన్సెలింగ్‌లో అడ్మిషన్లు ఇచ్చే అవకాశం లేకుండా పోయిందని చెప్పారు. ప్రభుత్వం పక్షాన ప్రత్యేక న్యా యవాది రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఆఫ్ క్యాంపస్ కాలేజీల ఏర్పాటు నిమిత్తం మా ర్గదర్శకాల రూపకల్పనకు ఏర్పాటు చేసిన కమి టీ జూన్ 11న సమావేశం నిర్వహించిందని తెలిపారు. ప్రస్తుతం కౌన్సెలింగ్ ప్రారంభమైన ఈ దశలో ఆఫ్ క్యాంపస్‌లకు అడ్మిషన్లు అనుమతించడం సాధ్యం కాదని స్పష్టంచేశారు. ఈ అంశాన్ని వచ్చే ఏడాది పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కోర్టుకు వచ్చిన కాలేజీలకు మాత్రమే కాకుండా ఏ ఇ తర కాలేజీలకు కూడా ఆఫ్ క్యాంపస్‌ల నిర్వహణకు అనుమతి మంజూరు చేయలేదని చె ప్పారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ ఏఐసీటీఈ అనుమతుల మంజూరు చేయకముం దు వివరణ అడిగినప్పుడు సకాలంలో స్పం దించవచ్చు కదా అని ప్రశ్నించింది. ఏదో ఒక కారణం చూపుతూ అనుమతులను తిరసరించడం చెల్లదని పేరొంది. ఏకవాక్య తీర్మానం తో కాలేజీల దరఖాస్తులను తిరసరించరాద ని, తిరసరణకు కారణాలను పేరొనాలని స్ప ష్టంచేసింది. దరఖాస్తులను పరిశీలించి ని ర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను ముగిస్తున్నట్టు ప్రకటించింది.

# అధికారం... ప్రదానం...

-మొదటిపేజీ తరువాయి



నెలకే హస్తం నేతలతో టచ్‌లోకి వచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే ఆలస్యం.. వచ్చి గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. సికింద్రాబాద్ ఎంపీగా కాంగ్రెస్ తరఫున పోటీ చేశారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయలేదు. ప్రస్తుతం దానంపై అనర్హత పిటిషన్‌పై తీర్పు పెండింగ్‌లో ఉంది. ఇదిలా ఉంటే.. తాజాగా దానం నాగేందర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఝలక్ ఇచ్చారు. ఓ ఇంటి గోడను కూల్చిన కేసులో దానంపై కేసు నమోదుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.అధికారం కోసం పాకులాడే నేతల్లో మొదటి వ్యక్తి దానం నాగేందర్. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ నేతృత్వంలో దానంకు కాంగ్రెస్ టికెట రాలేదు. దీంతో మరుసటి రోజే టీడీపీలో చేరి ఆ పార్టీ తరఫున పోటీచేసి గెలిచారు. కానీ, ఆ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో నెలకే దానం.. తిరిగి నాటి ముఖ్యమంత్రి వైఎస్సార్‌ను కలిశారు. కాంగ్రెస్‌లో చేరతానని వేడుకున్నారు. వైఎస్సార్ రాజనీతి మేరకు ఎమ్మెల్యే పదవికా రాజీనామా చేసి రావాలని సూచించారు. దీంతో రాజీనామా చేసి మళ్లీ కాంగ్రెస్ తరఫున పోటీ చేశారు. కానీ ఓడిపోయారు. అయినా వైఎస్సార్ దానం నాగేందర్‌ను దగ్గరుండి చూసుకున్నారు. అప్పట నుంచి హైదరాబాద్‌లో దానం దందాలు మొదలు పెట్టారు. తెలంగాణ వచ్చాక కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్ గూటికి చేరారు. అక్కడ పదేళ్లు ఉండి.. దందాలు కొనసాగించారు. ఇక గతేడాది కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇప్పుడు కాంగ్రెస్ గూటికి వచ్చారు. ఇక్కడ మళ్లీ స్వేచ్ఛగా దందాలు మొదలు పెట్టారు.ఇక దానం రూల్స్ విభిన్నంగా ఉంటాయి. దందాలు పెట్టించుకోవడం దాదాగిరి చేయడం ఆయనకు ఇష్టం. అందుకే న్యాయం చేయాలని ఎవరు ముందు వస్తే వారికే న్యాయం చేస్తాడు. కబ్జాకోరే వచ్చి న్యాయం చేయాలన్నా.. బాధితులకు ధమ్కా ఇస్తాడు. ముందు వచ్చినవాడితే న్యాయం అని నమ్ముతాడు. ఈ క్రమంలోనే తాజాగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు చెందిన భూమిలో ఉన్న కాంపౌండ్ వాలన్ ను కూల్చి వేశారు. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు దానంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే సీఎంవోను సంప్రదించారు. వారు సీఎం రేవంత్‌రెడ్డితో జరిగిన విషయం చెప్పారు. వెంటనే కేసు నమోదు చేయాలని సీఎం ఆదేశించారు. దీంతో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయనతోపాటు ఆయన అనుచరులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 69లోని నందగిరి హిల్స్ లోని గురుబ్రహ్మ నగర్ కాలనీలో 800 గజాల స్థలంలో ఉన్న ప్రహరీ గోడను దానం నాగేందర్ అనుచరులు కూల్చివేశారు. ఆయన అనుచరులు గోపాల్ నాయక్, రాంచదర్ ఈ గోడను కూల్చి వేయించారు. దీనిపై జీహెచ్ఎంసీ అధికారులు చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

**నేను లోకల్ అంటున్న దానం**

ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ ఏవీ రంగనాథ్ పై ఎమ్మెల్యే దానం నాగేందర్ ఫైర్ అయ్యారు. రంగనాథ్ కు కొత్తగా వచ్చిన పదవి ఇష్టం లేనట్లు ఉందన్నారు. అందుకే తనపై కేసులు పెట్టారని మండిపడ్డారు. అధికారులు వస్తుంటారు, పోతుంటారు.. నేను లోకల్ అంటూ వార్నింగ్ ఇచ్చారు దానం. నందగిరి హిల్స్ హుడా లేఔట్ లో ప్రజలకు ఇబ్బంది కలుగుతోందని తెలిసి తాను అక్కడికి వెళ్లానని దానం చెప్పారు. అక్కడ జరిగిన విషయాన్ని రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. అక్కడి ప్రజల సమస్యలు పరిష్కరించడం తన బాధ్యతని ఆయన స్పష్టం చేశారు.నందగిరి హిల్స్ ఘటనపై అధికారులకు ప్రివిలేజేషన్ నోటీసులు ఇస్తానని దానం నాగేందర్ చెప్పారు. అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. గతంలోనూ తనపై కేసులు పెట్టారని, ఇప్పటి కేసులు తనకు కొత్తేమీ కాదన్నారు. పేదల కోసం ఎన్ని కేసులైనా భరిస్తానన్నారు.అంతకుముందు నంది హిల్స్ ఘటనలో ఎమ్మెల్యే దానం నాగేందర్ తో పాటు మరికొందరిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 69లో ప్రభుత్వ స్థలంలో ప్రహరీని ఈ నెల 10న కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కూల్చేసినట్లు అధికారులు గుర్తించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ సమక్షంలో గురుబ్రహ్మ నగర్ కి చెందిన గోపాల్ నాయక్, రాంచందర్ నాయక్ తదితరులు కూల్చివేత ఘటనలో ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ప్రహరీ కూల్చివేతతో రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లిందని ఫిర్యాదు చేశారు. ఈ కేసులో దానం నాగేందర్ ను ఏ-3గా పోలీసులు చేర్చారు.

## సిరిసిల్లలో అరుదైన ఖనిజాలు...

**కరీంనగర్ :** సిరిసిల్ల.. ఈ పేరు చెప్తే చేనేత వస్త్రాలను గుర్తుకు వస్తాయి. సాగునీటి వనరులు మదిలో మెదులుతాయి..ఇసుక రీచ్ లు కళ్ళ ముందు కదలాడుతాయి. అలాంటి ఈ ప్రాంతంలో ఇప్పుడు సరికొత్త విషయం వెలుగు చూసింది. శాస్త్రవేత్తల పరిశోధనలు ఈ ప్రాంతంలో అరుదైన ఖనిజాలు వెలుగు చూసాయి. దీంతో రాష్ట్ర గనుల శాఖ మరింత లోతుగా పరిశోధన చేసేందుకు అడుగులు వేస్తోంది. కొత్తపల్లి ? మనోహరాబాద్ రైలు మార్గం నిర్మిస్తుండగా.. జరుపుతున్న తవ్వకాలలో ఈ ఖనిజ సంపద వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సర్వే నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి కోరిందని తెలుస్తోంది. కొత్తపల్లి ? మనోహరాబాద్ రైల్వే లైన్ లో భాగంగా మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు రైల్వే లైన్ పూర్తయింది. ఈ రైల్వే లైన్ నిర్మిస్తున్న క్రమంలో సిద్దిపేట నుంచి సిరిసిల్ల వరకు పలు మట్టి నమూనాలను అధికారులు సేకరించి.. తదుపరి పరీక్ష నిమిత్తం పంపించారు.ఈ నమూనాలలో అత్యంత విలువైన ఖనిజా సంపద ఉన్నట్టు అధికారులు గుర్తించారు. దీంతో మరింత లోతుగా పరిశోధన మొదలుపెట్టారు. ఎందుకు సంబంధించిన వివరాలను రాష్ట్ర గనుల శాఖ కేంద్రానికి నివేదికలు పంపించింది. 562.47 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఈ ఖనిజ సంపద సిరిసిల్ల జిల్లాలో విస్తరించి ఉన్నట్టు తెలుస్తోంది. అయితే ఇందులో కొంత సిద్దిపేట జిల్లాలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఖనిజ సంపదలో 15 రకాల లాంతనైడ్స్ ఉన్నాయి. స్కాండియం, వేట్రియం వంటి ఖనిజాలు ఉన్నాయి. వేట్రియం బహిరంగ మార్కెట్లో కిలో 32వేలకు పైగా పలుకుతోంది. సిద్దిపేట జిల్లాలోని విటలాపురం, సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలోని పెద్ద లింగాపూర్, బస్వాపూర్, లక్ష్మీపూర్ గుట్టల్లో అధికారులు పరిశోధనలు చేస్తున్నారు. వీటి ద్వారా అరుదైన ఖనిజ సంపద బయటపడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఒకవేళ భారీ స్థాయిలో ఖనిజాలు ఉంటే..ఇక్కడ మైనింగ్ కార్యకలాపాలు కొనసాగించే అవకాశం ఉందని తెలుస్తోంది.స్కాండియం, వేట్రియం వంటి ఖనిజాలను అంతరిక్ష పరిశోధనలో ఉపయోగిస్తారు. ఇక్కడ లభ్యమైన ముడి ఖనిజాలను శుద్ధి చేసి.. రాకెట్లు, ఉపగ్రహాల తయారీలో ఉపయోగిస్తారు. వీటికి వెస్ట్రన్ కంట్రీస్ మార్కెట్లో విపరీతమైన డిమాండ్ ఉంటుంది. స్కాండియాన్ని వజ్రాల శుద్ధి, వివిధ రకాలైన ఆమ్లాల తయారీలో ఉపయోగిస్తారు. న్యూక్లియర్ రియాక్టర్ల ఇంధనం లోనూ స్కాండియంను ఉపయోగిస్తారు. ఒకవేళ ఇక్కడ భారీ స్థాయిలో గనుక ఖనిజాలు ఉంటే.. కేంద్రం కచ్చితంగా వెలికితీస్తుందని ప్రచారం జరుగుతోంది. అపరమైన ఖనిజ సంపద ఉందని వార్తలు వస్తున్న నేపథ్యంలో.. స్థానికులు కూడా తెగ చర్చించుకుంటున్నారు.

## అప్పటి వరకు మౌనమేనా?

-మొదటిపేజీ తరువాయి

పాల్గొన్నా?.. ఏదో ప్రత్యేకత ఉంటుందని అందరూ భావిస్తారు. తన అనర్గళమైన ప్రసంగాలతో తెలంగాణ ప్రజలకు ఎంతో చేరువయ్యారు కేసీఆర్. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీ నేత హోదాలో గులాబీ పార్టీ అధినేత కేసీఆర్ కొన్ని నెలలుగా సైలెంట్‌గా ఉంటున్నారు.రాష్ట్రంలో గులాబీ పార్టీ ప్రతిపక్ష పార్టీగా మారిన తరువాత పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు కేసీఆర్. అప్పటికే కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవితను లిక్కర్ స్కామ్‌లో అరెస్టు చేశాయి దర్యాప్తు సంస్థలు. కవిత అరెస్టు.. రాజకీయ కుట్రలో భాగంగా జరిగిందని గులాబీ పార్టీ విమర్శలు చేస్తున్నా?. ఎన్నికల ప్రచారంలో మాత్రం ఎక్కడా ప్రస్తావించలేదు కేసీఆర్. పార్టీ అంతర్గత సమావేశాల్లో మాత్రం అధినేత కేసీఆర్ తన ఆవేదనను వ్యక్తం చేశారు.కుమార్తె అరెస్ట్ అయితే ఏ తండ్రికి అయినా బాధ ఉండదా అంటూ వ్యాఖ్యానించారు. ఈ విషయంలో అగ్నిపర్వతంలా రగిలి పోతున్నా సైలెంట్‌గా ఉండక తప్పడం లేదన్నారు కేసీఆర్. ఈ వ్యాఖ్యలను గమనిస్తే కేసీఆర్ ఏ స్థాయిలో ఒత్తిడిలో ఉన్నారన్నది అంచనా వేయవచ్చు. ఈ కారణంగానే పార్టీ నేతలను, కార్యకర్తలను కలుసుకునేందుకు కేసీఆర్ పెద్దగా ఆసక్తి చూపడం లేదన్న చర్చ పార్టీలో జరుగుతుంది.పార్టీ కార్యక్రమాల నిర్వహణపైన గులాబి నేతలు కసరత్తు చేసి కార్యాచరణను సిద్ధం చేసినా కేసీఆర్ ఆసక్తి చూపడం లేదు. ఈ సమయంలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తప్పుడు సంకేతాలు వెళ్తాయన్న అభిప్రాయంతో కేసీఆర్- పార్టీ కార్యక్రమాలను కూడా పెద్దగా పట్టించుకోవడంలేదని తెలుస్తోంది. కుమార్తె కవితకు బెయిల్ వచ్చిన తర్వాతే పార్టీ కార్యక్రమాల్లో కేసీఆర్ పాల్గొనే అవకాశం ఉన్నట్లు సమాచారం. బెయిల్ తర్వాతే పార్టీ నేతలకు పూర్తిస్థాయిలో కేసీఆర్ అందుబాటులో ఉండే అవకాశం కనిపిస్తుంది. ఈ కారణంగానే అసెంబ్లీ సమావేశాల్లో హాజరయ్యేందుకు కేసీఆర్ పెద్దగా ఆసక్తి చూపడంలేదని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. లిక్కర్ స్కామ్‌లో అరెస్ట్ అయిన ఆప్ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు బెయిల్ వచ్చింది. దీంతో కల్వకుంట్ల కవితకు కూడా త్వరలో బెయిల్ మంజూరు అవుతుందన్న ధీమాతో గులాబీ పార్టీ ఉంది. అయితే సుప్రీంకోర్టు ఎమ్మెల్సీ కవితకు మధ్యంతర బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. తదుపరి విచారణ ఆగస్టు 20కి వాయిదా వేసింది. దీంతో కవితకు బెయిల్ వచ్చే వరకు కేసీఆర్ మౌనంగానే ఉండే అవకాశం కనిపిస్తోంది.

## నేడే మూడో విడత రుణమాఫీ

-మొదటిపేజీ తరువాయి

జమ కానుంది.దక్షిణకొరియాలో పర్యటనలో ఉన్న రేవంత్ రెడ్డి బుధవారం హైదరాబాద్ చేరుకుంటారు. గురువారం ఉదయం గోల్కొండ కోటలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం ఖమ్మం జిల్లాకు సీఎం బయలుదేరుతారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేస్తోంది. ఇందులో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం మూడో విడత రుణమాఫీకి సిద్ధమైంది. జూలై 15వ తేదీన రుణమాఫీ జీఓ జారీ చేసిన ప్రభుత్వం.. కేవలం మూడు రోజుల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయడం ప్రారంభించింది.జూలై 18న తొలి విడతలో రూ.లక్ష వరకు రుణ మాఫీ చేసింది. ఇందులో 11లక్షల 14వేల412 మంది రైతులకు రూ.6,034.97కోట్లు విడుదల చేసింది. జూలై 30వ తేదీన రెండో విడతలో రూ.లక్షన్నర వరకు రుణాలను మాఫీ చేసింది. ఈ మేరకు రేపు రూ.2లక్షల వరకు మాఫీ చేయనుంది. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా 32.50లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేసేందుకు రూ.31వేల కోట్ల రుణమాఫీకి ప్రభుత్వం నిధులు కేటాయించి దేశంలోనే కొత్త రికార్డు నెలకొల్పొంది.మూడో విడతలో మొత్తం 14.45 లక్షల మందికి రుణమాఫీ అవుతుందని ప్రభుత్వం తెలిపింది. కేవలం 12 రోజుల వ్యవధిలోనే మూడు విడతల్లో కలిపి దాదాపు 17.55 లక్షల మంది రైతులకు రూ.12వేల కోట్లకుపైగా రుణాలు మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

## 50 వేల కోట్ల అప్పులా...

**హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే 50 వేల కోట్ల రూపాయలు అప్పులు తీసుకురావటంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. మార్పు అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఎప్పుడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 8 నెలల్లోనే 50 వేల కోట్ల అప్పు చేయటమేనా వాళ్లు చెప్పిన మార్పు అని ప్రశ్నించారు. ఒక్క కొత్త ప్రాజెక్ట్ కూడా లేకుండా రూ. 50 వేల కోట్ల రూపాయలు అప్పు తేవాల్సిన అవసరమెుచ్చిందని నీలదీశారు. 2023 నాటికి రాష్ట్రం 5,900 కోట్ల మిగులు బడ్జెట్ తో ఉంటే 8 నెలల కాలంలో దాన్ని 50 కోట్ల అప్పుగా మార్చేశారని మండిపడ్డారు. రాష్ట్ర సంపద పెంచిన బీఆర్ఎస్ పై అప్పులు, అప్పులు అంటూ తప్పుడు ప్రచారం చేశారన్నారు. అపోహలు, అర్థ సత్యాలను ప్రచారం చేసి జనాన్ని తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మాత్రం అన్ని రికార్డులను బద్దలు కొడుతూ అప్పులు చేయటంలో టాప్ లో నిలుస్తుందన్నారు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏం సమధానం చెబుతుందని కేటీఆర్ ప్రశ్నించారు. ఇదే విధంగా అప్పులు చేసుకుంటూ పోతే కాంగ్రెస్ పదవీకాలం ముగిసే నాటికి 4-5 లక్షల కోట్ల అప్పుల భారం రాష్ట్రం పై పడడం ఖాయమని చెప్పారు. అప్పుల విషయంలో బీఆర్ఎస్ ను బద్నాం చేసి ప్రజలను మోసం చేయటంలో కాంగ్రెస్ విజయవంతమైందన్నారు. కానీ ప్రజలు అన్ని గమనిస్తున్నారని సరైన సమయంలో కాంగ్రెస్ కు కచ్చితంగా బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు.


పల్లెల్లో పాలన పడకేసింది - కేటీఆర్

‘కాంగ్రెస్ పాలనలో.. పల్లెలు, పట్టణాలు కంపు కొడుతున్నాయి.. ఓవైపు తెలంగాణ పల్లెల్లో పాలన పూర్తిగా పడకేసింది.. మరోవైపు పట్టణాల్లో పరిస్థితి అధ్వాన్నంగా మారింది.. అటు కేంద్రం నుంచి, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోవడంతో పంచాయతీలు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. పాత పనులకు ఎనిమిది నెలలైనా బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయిన తాజా మాజీ సర్పంచ్ ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పారిశుధ్యం, డ్రైనేజీ నిర్వహణ అధ్వాన్నంగా మారడంతో.. పల్లెల్లో ప్రజల జీవనం దినదిన గండంలా మారింది. దోమల మందుకు కూడా నిధులు లేకపోవడంతో పంచాయతీల్లో డెంగ్యూ, మలేరియా విజృంభిస్తున్నాయి” అని కేటీఆర్ మరో పోస్ట్ చేశారు.

## ఎర్రబెల్లి పార్టీ మార్పు.. ఊహాగానాలు


**వరంగల్ :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎర్రబెల్లి దయాకర్ రావు పార్టీ మార్పు ఎపిసోడ్ మళ్లీ తెరపైకి వచ్చింది. దయాకర్ రావు కాంగ్రెస్ పార్టీ లో చేరుతున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే ఒక్కసారిగా దయాకర్ రావు పార్టీ మారకపోవడంతో పాటు, బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలకు, నియోజకవర్గానికి దూరంగా ఉంటూ వచ్చారు. దయాకర్ రావు మనసు మార్చుకున్నారా... లేదా బీఅర్ఎస్ లోనే కొనసాగాలనుకున్నారో తెలియదు కానీ మళ్ళీ యాక్టివ్ అయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మాస్ లీడర్ గా, బీ ఆర్ ఎస్ లో కీలక నేతగా కొనసాగుతున్న నేత ఎర్రబెల్లి దయాకర్ రావు మళ్ళీ యాక్టివ్ అయ్యారు. కాంగ్రెస్ లోకి వెళ్తున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో బీ అర్ ఎస్ కు కొద్దిరోజులుగా దూరంగా ఉంటూ వచ్చారు. బీ అర్ ఎస్ సైతం దయాకర్ రావును పెద్దగా సీరియస్ గా తీసుకోలేదు. అయితే కొద్ది రోజులుగా దయాకర్ రావు పార్టీ కార్యక్రమాలతో పాటు నియోజకవర్గానికి వచ్చి వెళ్తున్నారు.కాంగ్రెస్ లో చేరికలపై ఎర్రబెల్లి దయాకర్ రావు అనుచరులతో కీలక సమావేశం నిర్వహించారు. రెండు రోజుల క్రితం పాలకుర్తి నియోజకవర్గానికి వచ్చిన ఎర్రబెల్లి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా తొర్రూరులో ఎర్రబెల్లి ముఖ్య నేతలు, అనుచరులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి మీడియాకు అనుమతి లేదని చెప్పారట. అంతే కాకుండా సమావేశంలో ఉన్నవారు ఫోటోలు, వీడియో లు తీయవద్దని హెచ్చరించారట. సమావేశాల్లో దయాకర్ రావు తాను పార్టీ మారుతున్నట్లు ప్రచారం అవాస్తవమని, కాంగ్రెస్ పెద్దలు తనను సంప్రదించి ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రిపదవి ఇస్తామనారని అనుచరులతో ఎర్రబెల్లి చెప్పినట్లు సమాచారం. తాను కాంగ్రెస్ లో చేరనని, ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందని ప్రజలు బీఆర్ఎస్‌ను కావాలని కోరుకుంటున్నారని దయాకర్ రావు చెప్పారని తెలిసింది. తాను అమెరికాకు వెళ్దామనుకున్నది వాస్తవమే. అదే సమయంలో రేవంత్ రెడ్డి అమెరికా టూర్ ఖరారు కావడంతో రద్దు చేసుకున్నానని ఎర్రబెల్లి అనుచరులతో తెలిపారట. ఈనెల చివరి వారంలో వెళ్లనున్నట్లు చెప్పినట్లు సమాచారం. పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం సొంతంగా డబ్బులు ఖర్చు చేశానని కూడా అనుచరులతో అన్నారట. అయితే పార్టీ మార్పుపై దయాకర్ రావు క్లారిటీ ఇవ్వడంతో అనుచరులు, కార్యకర్తలు అందం వ్యక్తం చేశారట.

# దోస గింజలతో లెక్కలేనన్ని ప్రయోజనాలు



ఆరోగ్యంగా ఉండాలని చాలామంది ఫుడ్ విషయంలో డైట్ ఫాలో అవుతుంటారు. మినరల్స్, పోషకాలు ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకుంటారు. డ్రైఫ్రూట్స్, క్యారెట్, బీట్‌రూట్, పండ్లు, కీరాను వాళ్ల డైలీ డైట్‌లో చేర్చుకుంటారు. వీటిని తినడం వల్ల యంగ్‌గా ఉండటంతో పాటు ఆరోగ్యంగా ఉంటామని భావించి తప్పకుండా వీటిని డైట్‌లో చేర్చుతారు. అయితే ఆరోగ్యంతో పాటు ఫిట్‌గా ఉండాలనుకునే వాళ్లకు దోసకాయ బాగా ఉపయోగపడుతుంది. దీనిని తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. కేవలం దోసకాయతోనే మాత్రం కాకుండా దోస గింజలతో కూడా ఎన్నో లాభాలున్నాయి. మరి ఆ లాభాలేంటో తెలుసుకోవాలంటే ఈ ఆర్టికల్ చదివేయండి. దోస గింజలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. కానీ చాలామంది వీటిని తినకుండా బయట పడేస్తుంటారు. ఈ గింజలను రోజూ తింటే యవ్వనంగా కనిపించడంతో చర్మంపై ముడతలు పోయి అందంగా ఉంటారు. వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను బలపర్చడంలో సాయపడుతుంది. రోజూ వీటిని తినడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు తగ్గుతాయి. అలాగే పేగులను శుభ్రం చేసి మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. ఈ గింజల్లో ఉండే మెగ్నీషియం, పొటాషియం, ఫైబర్ గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. దీనివల్ల గుండె జబ్బులు తగ్గే అవకాశం ఉంది. దోస గింజలలో ఉండే కాల్షియం, ఫాస్పరస్ ఎముకలు బలంగా ఉండేలా చేస్తాయి. ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలు రాకుండా నివారిస్తుంది. అలాగే ఈ గింజలు మధుమేహ రోగులకు మేలు చేస్తాయి. ఇందులో ఉండే పీచుపదార్థాలు రక్తంలోని చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంతో పాటు జుట్టు పెరిగేలా కూడా చేస్తాయి. ఈ గింజల్లో ఉండే పోషకాలు జుట్టు దృఢంగా ఉండటంతో పాటు రాలిపోకుండా ఉంటుంది. తొందరగా జుట్టు కుదుళ్ల నుంచి పెరుగుతుంది. ఇందులో తక్కువ కేలరీలు ఉంటాయి. ఇవి బరువును నియంత్రించడంలో సాయపడతాయి. ఇవి మూత్రాశయ ఇన్ఫెక్షన్, యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడటంతో పాటు మళ్లీ రాకుండా నియంత్రిస్తుంది. యువత ఈమధ్య కాలంలో ఎక్కువగా కీడ్నీ స్టోన్ సమస్యలతో బాధపడుతున్నారు. దోస గింజలు రోజూ తింటే ఈ సమస్యల నుంచి విముక్తి పొందవచ్చు.

# యూరిన్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నట్లయితే..




ఈమధ్యకాలంలో చాలామంది యూరినరీ సమస్యలతో బాధపడుతున్నారు. ప్రతి ఒక్కరు ఏదో ఒక సమయంలో దీనితో ఇబ్బందిపడే ఉంటారు. అయితే ఈ సమస్యతో బాధపడేవాళ్లు అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువ ఉంటారు. అయితే యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ వల్ల మూత్రంలో మంట, రక్తస్రావం, జ్వరం వస్తుంటాయి. మరి ఈ ఇన్ఫెక్షన్ ఎందువల్ల వస్తుంది? దీనికి కారణాలేంటి? దీనిని తగ్గించుకోవడానికి ఎలాంటి చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం. చాలామంది మూత్రం వెళ్లిన తర్వాత సరిగ్గా శుభ్రం చేసుకోరు. దీనివల్ల కొన్నిసార్లు ఇన్ఫెక్షన్ సోకుతుంది. ఈ ప్లేస్‌ను తేమగా ఉంచకూడదు. ఎప్పటికప్పుడు క్లీన్ చేసుకోవాలి. శరీరానికి సరిపడా నీరు తాగకపోయిన ఇన్ఫెక్షన్ వస్తుంది. మలవిసర్జన తర్వాత మలద్వారం నుంచి బ్యాక్టీరియా, క్రిములు మూత్రనాళంలోకి వెళ్లడం వల్ల కూడా ఇన్ఫెక్షన్ వస్తుంది. పులుపు, కారం, చక్కెర ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తినడంతో పాటు కెఫిన్, కార్బోనేటేడ్ డ్రింక్స్, కాఫీ, చాక్లెట్స్ తీసుకోవడం వల్ల కూడా ఈ ఇన్ఫెక్షన్ వస్తుంది. కాబట్టి వీటికి దూరంగా ఉండటం మంచిది. ఈ యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ వల్ల అంత ప్రమాదం లేదు.

# దాల్చిన చెక్కతో ఉపయోగాలు




ప్రస్తుతం చాలా మందికి ఏదో ఒక వ్యాధి, సమస్యలు వస్తున్నాయి. ఆరోగ్యం పరంగా చూస్తే ఎక్కువ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. కానీ తీసుకునే ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకుంటే చాలా సమస్యల నుంచి దూరంగా ఉండవచ్చు. ఇంటి కిచన్ లోనే ఆరోగ్యాన్ని కాపాడే ఇంగ్రీడియన్స్ చాలా ఉంటాయి. వాటి గురించి తెలుసుకొని ఉపయోగించడం వల్ల చాలా సమస్యలకు చెక్ పెట్టవచ్చు. పసుపు ఎన్ని విధాలుగా ఉపయోగపడుతుందో తెలిసిందే. ఇదే విధంగా చాలా పదార్థాలు మీకు ఉపయోగపడతాయి. అందులో ఒకటి దాల్చిన చెక్క. బిర్యానీ, మసాలా వంటకాల్లో ఉపయోగించే దినుసుల్లో దాల్చిన చెక్క ముఖ్యమైనదిగా పరిగణిస్తారు. సుగంధ ద్రవ్యాల్లో ఒకటైన ఈ. దాల్చిన చెక్కతో రుచికరమైన ఆహారమే కాకుండా.. ఎన్నో అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చు అంటున్నారు ఆరోగ్య నిపుణులు. కిచెన్ హ్యాక్స్ కింద కూడా ఈ దాల్చిన చెక్కను ఉపయోగించవచ్చుట. ఇందులో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. వీటితో చాలా రకాల అనారోగ్య సమస్యలు నయం అవుతాయట. మరి అవేంటో కూడా ఓ సారి చూసేద్దాం. దాల్చిన చెక్క వాతం వ్యాధులను నయం చేస్తుంది. దీని పొడిని గోరు వెచ్చటి నీటిలో కలిపి తాగాలి. ఈ నీటిని తాగడం వల్ల కడుపులో ఉండే వాతం తగ్గుతుందట. దాల్చి చెక్క రసాన్ని లేదా పొడిని ప్రతి రోజూ చిటికెడు తీసుకున్నా శరీరంలో చేరిన నీరు తొలగి పోతుంది అంటున్నారు నిపుణులు. మైగ్రేన్ తలనొప్పికి దాల్చిన చెక్కతో చెక్ పెట్టవచ్చు. చిన్న దాల్చిన చెక్క ముక్కను నోట్లో పెట్టుకుని చప్పరించాలి. దీనివల్ల స్వర పేటిక వాపు, గొంతు బొంగురు పోవడం వంటి సమస్యలను ఇది దూరం చేస్తుంది. ఇక పీరియడ్స్ సమయంలో ఆడువారిలో వచ్చే సమస్యల్ని కూడా కంట్రోల్ చేస్తుంది ఈ మసాలా దినుసు. దాల్చిన చెక్కను తీసుకోవడం వల్ల రక్త హీనత వల్ల బాధ పడేవారు ఉపశమనం పొందుతారు. జీర్ణ వ్యవస్థ, దంతాలు, నోటి ఆరోగ్యం మెరుగు పడుతుంది. దాల్చిన చెక్క ఆయిల్ వల్ల కళ్ల సమస్యలు కూడా తొలుగుతాయి. ఇందుకోసం కళ్లను మూసి రాయడం వల్ల కళ్ల నొప్పులు, వాపు తగ్గుతాయి.

# పారాసిటమాల్ అధికంగా వేసుకుంటున్నారా?




ముందు జాగ్రత్త కోసం చాలామంది ఇంట్లో మాత్రలు ఉంచుకుంటారు. అర్ధరాత్రి ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే ఎక్కడికి వెళ్తాం అని ఫీవర్, విరేచనాలు, తలనొప్పి వాటికి టాబ్లెట్లు పెట్టుకుంటారు. అందులో పారాసిటమాల్ తప్పకుండా ప్రతి ఒక్కరి ఇంట్లో ఉంటుంది. సాధారణంగా బాడీ హీట్ అయితే ఫీవర్ వచ్చిందని పారాసిటమాల్ టాబ్లెట్ వేసుకుంటారు. మరికొందరైతే ఫీవర్ వస్తాదేమోనని ముందు జాగ్రత్తగా మాత్రలు వేస్తారు. కానీ కొందరైతే జలుబు, జ్వరం, దగ్గు, కీళ్ల నొప్పులు ఇలా ఏ సమస్య వచ్చినా పారాసిటమాల్ మాత్రలు వేసుకుంటారు. వీటిని అధికంగా వేయడం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ మాత్రలను అధిక మోతాదులో శరీరంలోకి పంపడం వల్ల కాలేయం దెబ్బతింటుందని ఎడిన్‌బర్గ్ యూనివర్సిటీ తెలిపింది. చాలామంది ఈ మాత్రలను జ్వరం, దగ్గు, జలుబు, నొప్పి, వికారంగా ఉన్నవాళ్లు డాక్టర్ అనుమతి తీసుకోకుండా వేసుకుంటారు. అవసరం లేకపోయిన అధిక మోతాదులో వేసుకోవడం వల్ల ప్రాణానికే ప్రమాదమని ఎడిన్‌బర్గ్ యూనివర్సిటీ ఓ అధ్యయనంలో తెలిపింది. పారాసిటమాల్‌లో 500, 650 అనే రెండు రకాల మాత్రలు ఉంటాయి. వయస్సు, జ్వరం తీవ్రతను బట్టి వీటిని డాక్టర్లు సూచిస్తారు. చాలామంది ఎక్కువగా పారాసిటమాల్ 500 వాడుతారు. దీనిని ఎసిటమైనోఫిన్ అని కూడా అంటారు. అయితే దీనిని స్థాయికి మించి వాడితే తప్పకుండా ఆరోగ్యం దెబ్బతింటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇబుప్రోఫెన్, న్యాప్రోక్సెన్‌లతో చూస్తే ఎసిటమైనోఫిన్ అనారోగ్యానికి గురిచేస్తుంది. దీనిని అధికంగా తీసుకుంటే కాలేయంలో విషపూరితాలు ఉత్పత్తి అవుతాయి. దీంతో కాలేయం దెబ్బతింటుంది. ఇది కొన్నిసార్లు కాలేయ మార్పిడి లేదా మరణానికి దారితీస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# పల్లీలతో ఇన్ని ప్రయోజనాలా?



భారతదేశం సంప్రదాయాలకు, రకరకాల వంటకాలకు పుట్టినిల్లు. ఉద్యోగం లేదా చదువు కోసం దేశాన్ని విడిచి వెళ్లిన వాళు ఇండియా సంప్రదాయాలు, వంటకాలను ఎప్పుడు మిస్ అవుతూనే ఉంటారు. భారతీయ వంటకాలు రుచిగా ఉండటంతో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే వేరే దేశాల్లో ఉన్న మన ఇండియన్స్ టిఫిన్స్‌లో రోజూ చేసుకునే వాటిలో పల్లీ చట్నీ ఒకటి. ఇది ఆరోగ్యానికి చాలామంచిది. మరి వీటివల్ల కలిగే ప్రయోజనాలేంటి? ఈ చట్నీని ఎలా తయారు చేస్తే రుచిగా ఉంటుందో తెలుసుకుందాం. వేరుశనగ గింజలు శరీరానికి బలాన్నిస్తాయి. వీటితో తయారు చేసిన బిస్కెట్లు, చాక్లెట్లు, చక్కీలు తింటే చాలా ఆరోగ్యంగా ఉంటారు. ఇందులో ఐరన్, మెగ్నీషియం, మోనోశాచురేటెడ్ కొవ్వులు, విటమిన్ ఇ, నియాసిన్, ప్రోటీన్, మాంగనీసు, అమినో యాసిడ్స్ వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సాయపడతాయి. అలాగే ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువగా ఉన్నాయి. రోజూ వీటిని ఏదో ఒక రకంగా తీసుకోవాలి. ఇందులోని పోషకాలు శరీరంలో చెడు కొలెస్ట్రాల్ లెవెల్స్‌ను తగ్గిస్తాయి. అలాగే అలెర్జీలు రాకుండా కాపాడుతాయి. వేరుశనగలో ఉండే కాల్షియం ఎముకల పెరుగుదలకు సాయపడుతుంది. అలాగే కీళ్లు నొప్పులు, మోకాల నొప్పులు రాకుండా కాపాడుతుంది. వేరుశనగలో ఉండే అమినో యాసిడ్స్ వల్ల మెదడు జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అలాగే క్యాన్సర్ కణాలను నశింపచేస్తుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మం మెరిసెలా చేస్తాయి. వృద్ధాప్య ఛాయలు రాకుండా యవ్వనంగా ఉంచుతుంది. అలాగే మొటిమలు రాకుండా చేస్తుంది. రాత్రిపూట వేరుశనగ గింజలను నానబెట్టి ఉదయాన్నే తింటే బరువు పెరగడంతో పాటు బలంగా తయారవుతారు. ఇందులోని ఫ్యాటీ యాసిడ్స్ డార్క్ సర్కిల్స్‌ను తగ్గించడంలో ఉపయోగపడతాయి.

# కిడ్నీల్లో రాళ్లు ఉన్నాయా?



ప్రతి ఒక్కరు కూడా నీరు తాగడం చాలా అవసరం. శరీరానికి తగినన్ని నీటిని అందించడం వల్ల చాలా సమస్యల నుంచి కాపాడుకోవచ్చు. నీరు సరిగ్గా తాగకపోవడం కిడ్నీలు ఒత్తిడికి గురవుతాయి..దీనివల్ల శరీరంలోని విసర్జక పదార్థాలు మూత్ర నాళంలో చిన్నపాటి రాయి మాదిరి తయారవుతాయి. ఇలా తయారు కావడాన్నే కిడ్నీలో స్టోన్లు వచ్చాయి. రాళ్లు వచ్చాయి అంటారు. అయితే కిడ్నీ సమస్యల నుంచి బయట పడాలంటే నీరు తగినంత ఉండాల్సిందే. అయితే ఇప్పుడు మనం చెప్పుకోబోయే నీరు చాలా ఉపయోపడతుంది. అదేంటో తెలుసా? మూత్రనాళంలో కిడ్నీ స్టోన్స్ వస్తే యూరిన్ వెళ్లే సమయంలో విపరీతమైన నొప్పి ఉంటుంది. స్టోన్ సైజ్ పెద్దగా ఉంటే విపరీతమైన కడుపు నొప్పి, జ్వరం, ఇన్ఫెక్షన్, వాంతులు వంటి సమస్యలు వస్తుంటాయి. చిన్నపాటి రాళ్లు అయితే ట్యాబ్లెట్స్, వాటర్ ఎక్కువగా తీసుకోవడం వల్ల వాటిని బయటకు పంపేయవచ్చు. కానీ సైజ్ పెద్దగా పెరిగితే మాత్రం కొన్ని సార్లు శస్త్ర చికిత్స కూడ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ కిడ్నీలోని రాళ్ల సమస్యకు కొబ్బరి నీళ్ల అద్భుత ఔషధమని అంటున్నారు నిపుణులు. ఇది శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచుతుంది. అంతేకాదు ఆరోగ్యానికి మేలు చేస్తుంది ఈ కొబ్బరి నీరు. ఇది కిడ్నీలో రాళ్లను నివారించి శరీరంలోని కొన్ని సమస్యలను నివారిస్తుంది. కొబ్బరి నీరులో పొటాషియం, మెగ్నీషియం, సోడియంతో సహా ఎలక్ట్రోలైట్లు ఎక్కువ ఉంటాయి. శరీరంలోని ద్రవాలను నియంత్రించి మూత్రపిండాల పనితీరుకు సహాయపడుతుంది. కొబ్బరి నీటిలో ఉండే అధిక యాంటీ ఆక్సిడెంట్లు మీ శరీరంలో ప్రోటీన్లను యాక్టివ్ చేస్తాయి. యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి కూడా సహాయపడతాయి. వ్యాధులను అభివృద్ధి చేసే ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఖనిజాలు, లవణాల గట్టి నిక్షేపాలు కిడ్నీ స్టోన్స్ . కొబ్బరి నీళ్లు తాగడం వల్ల టాక్సిన్స్‌ను బయటకు పంపవచ్చు. క్రియేటినిన్ స్థాయిలను తగ్గిస్తే స్ఫటికీకరణను నిరోధించవచ్చు. ఇది కొబ్బరినీరు వల్ల సాధ్యం అవుతుంది. కొబ్బరి నీటిని క్రమం తప్పకుండా తాగడం వల్ల మూత్రం పలచగా వస్తుంది. నీరు చిన్న చిన్న స్ఫటికాలుగా మారకుండా నిరోధిస్తుంది కొబ్బరినీరు. మంచి ఫలితాల కోసం కొబ్బరి నీళ్లలో సబ్జా గింజలను కలపి తీసుకుంటే మరింత ఎక్కువ ఫలితం ఉంటుంది అంటున్నారు పోషకాహార నిపుణులు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి




**జగిత్యాల :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎటువంటి ఇబ్బందులకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించే విధంగా తగు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు. బుధవారం రోజున కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులందరూ సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ లో పతాకావిష్కరణ జరుగుతుందని అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో ముఖ్య అతిథి జెండా ఎగురవేస్తారని పేర్కొన్నారు. పరేడ్ గ్రౌండ్ లో అంబులెన్స్, మెడికల్ ఆఫీసర్లు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి అవసరమైన ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ తో అందుబాటులో ఉండాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్య అతిథిచే ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై ప్రగతి నివేదిక సందేశం ఉన్నందున విద్యుత్ కు ఎటువంటి అంతరాయం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని విద్యుత్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం ప్రజా ప్రతినిధులకు, అధికారులకు సీట్లు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు గ్రౌండ్ లో ఎండలో డ్యాన్స్ చేస్తున్నందున వారికి ప్రియారిటి ఇచ్చి రిఫ్రెష్ మెంట్, మంచి నీరు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన మహాలక్ష్మి, గృహలక్ష్మి, ఆరోగ్య శ్రీ, రుణమాఫీ, రైతు భీమా, ఆయిల్ ఫామ్ లకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.
ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు పి.రాంబాబు, గౌతమ్ రెడ్డి, కలెక్టరేట్ ఏ.ఓ హన్మంతరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
**అడవి శ్రీరాంపూర్ జడ్పీహెచ్ఎస్ ప్రహారీ గోడ మరమ్మత్తులకు ప్రతిపాదనలు రూపొందించాలి**
**ముత్తారంలో మహిళా సంఘాలచే ఏర్పాటు చేసిన మిల్క్ పార్లర్ ప్రారంభం**
**ముత్తారం మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**మంథని :** ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని వినియోగించుకొని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ముత్తారం మండలంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి విస్తృతంగా పర్యటించారు. ముత్తారం మండలంలోని మైదంబండ గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అడవి శ్రీరాంపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలల్లోని తరగతి గదులలో విద్యాబోధనను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థుల ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అడవి శ్రీరాంపూర్ జడ్పీహెచ్ఎస్ ప్రహారీ గోడ మరమ్మత్తులకు అవసరమైన అంచనాలను రూపొందించి ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అడవి శ్రీరాంపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని విద్యార్థులకు కలెక్టర్ టీ షర్ట్ లు అందజేశారు.
ముత్తారం మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద శ్రీ రాజమాత గ్రామ సంఘం ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన శ్రీయాన్ మిల్క్ పార్లర్ ను కలెక్టర్ ప్రారంభించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద స్వశక్తి మహిళా సంఘాలకు బ్యాంకు ద్వారా రుణాలు అందజేసి వారి వ్యాపార యూనిట్ల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.
జిల్లాలో 12 రకాల వివిధ వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు మహిళలకు అవసరమైన సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తున్నామని, మహిళా సంఘాలచే మీసేవ కేంద్రాలు ఆహార శుద్ధి కేంద్రాలు, పౌల్ట్రీ యూనిట్ మొదలగు వివిధ వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.
ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద లక్షా 90 వేల రుణం తో ముత్తారంలో మిల్క్ పార్లర్ ఏర్పాటు చేశామని, దీనినే సమర్థవంతంగా నిర్వహించుకొని మహిళలు ఆర్థికంగా తమ కాళ్ళ మీద తాము నిలవాలని అయన సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ అవకాశాలను వినియోగించుకుంటూ మహిళలు ఆర్థిక స్వలంబ సాధన దిశగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం ముత్తారం మండలంలో ఖమ్మంపల్లి గ్రామంలో ఇటీవలే ప్రారంభించిన ఇసుక రీచ్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్, మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, ముత్తారం ఎంపీడీవో జి.లలిత, మండల పంచాయతీ అధికారి బి కిరణ్ ,పంచాయతీ రాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.వరలక్ష్మీ, ఎడిఎం డి .పద్మ, సంబంధిత అధికారులు, తదితరులు

## జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు వచ్చేవరకు వెన్నంటే ఉంటా

**నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్**



**జగిత్యాల :** జగిత్యాల జర్నలిస్టులు ఇళ్ల స్థలాలు పొందే వరకు వారి వెన్నంటే ఉంటానని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ అన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన కోసం గత 12 రోజులుగా నిరవధిక నిరసన దీక్ష చేపట్టిన జర్నలిస్టులు బుధవారం దీక్షా స్థలంలో వంట వార్పు కార్యక్రమాన్ని నిర్వహించి తమ నిరసనను తెలిపారు. జర్నలిస్టుల దీక్ష శిబిరానికి ఎంపీ ధర్మపురి అరవింద్ సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు..ఈ సందర్భంగా ఎంపీ అరవింద్ మాట్లాడుతూ తాను రాజకీయల్లోకి వచ్చిన నాటి నుండి ఇళ్ల స్థలాల కోసం జగిత్యాల జర్నలిస్టుల డిమాండ్ వినిపిస్తుందన్నారు. జర్నలిస్టులు కొత్తగా అడిగింది ఎం లేదని గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టులకు హామీ ఇచ్చిందన్నారు. జర్నలిస్టులకు ఇచ్చిన హామీ నెరవేరకుండా కొంతమంది నాయకులు అడ్డుపడుతున్నారని తెలిసిందని ఈ పద్ధతి మానుకోవాలని హితవు పలికారు. జర్నలిస్టుల న్యాయమైన కోరిక తీరేవరకు తాను వెన్నంటే ఉంటానన్నారు.వెంటనే జిల్లా కలెక్టర్ తో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని, తాను వ్యక్తిగతంగా ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞప్తి చేయడమే కాకుండా కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ద్వారా కూడా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా జర్నలిస్టులకు ఇచ్చే రాయితీ రైల్వే పాసులను పునరుద్ధరించాలని ఎంపీ కి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట బిజెపి జిల్లా అధ్యక్షులు మోరపల్లి సత్యనారాయణ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భోగ శ్రావణి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కృష్ణ హరి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల వంటావార్పు

**జగిత్యాల :** జర్నలిస్టుల ఇళ్లస్థలాల సాధన కోసం గత 12 రోజులుగా చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలో భాగంగా బుధవారం దీక్షా స్థలంలో వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. జర్నలిస్టులే స్వయంగా కూరగాయలు తరిగి వంటలు చేశారు. అనంతరం రోడ్డుపైనే సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రావు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల కోసం గత 15 రోజులుగా వివిధ రూపాలలో నిరసన తెలిపినప్పటికీ ప్రభుత్వానికి, నాయకులకు చీమకుట్టినట్లయినా లేదని అన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి అవి పరిష్కారమయ్యేలా కృషి చేసే జర్నలిస్టులకే సమస్యలు వస్తే వాటిని తీర్చడానికి ప్రభుత్వం,ప్రజా ప్రతినిధులు ముందుకు రాకపోవడం శోచనీయమన్నారు. తమ కలం, గళం ద్వారా ఎంతోమంది నాయకులను తయారు చేశామని అలాంటి నాయకులే జర్నలిస్టుల సేవలను విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన కోరికను నెరవేర్చకుంటే రాబోయే రోజుల్లో తమ ఉద్యమాన్ని జిల్లా స్థాయికి విస్తరిస్థామని హెచ్చరించారు. జర్నలిస్టుల దీక్షలకు సారంగాపూర్ ప్రెస్ క్లబ్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి,రాజశేఖర్ జగదీష్, శ్రీనివాస్, తదితరులు సంఘీభావం తెలుపగా వంట వార్పు కార్యక్రమానికి గో సేన అసోసియేషన్ జిల్లా యూత్ అధ్యక్షులు కట్ట శివకుమార్ సహకరించారు.

## ట్యాబ్ అసెస్మెంట్ ద్వారా ఇబ్బందులను ఎదుర్కొంటున్న విద్యార్థులు,టీచర్లు

**ఆన్లైన్ పరిజ్ఞానం లేనందున ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు.**
**ఆన్లైన్ అసెస్మెంట్ టెస్టుల ద్వారా చదువులకు దూరం అవుతున్న విద్యార్థులు.**
**ఆవేదన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు మరియు తల్లిదండ్రులు.**

**తుగ్గలి :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల యందు విద్యనభ్యసిస్తున్న పదవ తరగతి విద్యార్థులు ట్యాబ్ అసెస్మెంట్,సీబీఎస్సీ సిలబస్ ల ద్వారా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు పలువురు విద్యార్థులు,తల్లిదండ్రులు తెలియజేస్తున్నారు.ప్రస్తుతం తుగ్గలి మండలం పరిధిలో జొన్నగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు, పెండేకల్ ఆర్.ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు మరియు కస్తూరిబా పాఠశాలల యందు మాత్రమే విద్యార్థులు సీబీఎస్సీ సిలబస్ విద్యను అభ్యసిస్తున్నారు.ఈ సీబీఎస్ఈ పాఠశాలల యందు నిర్వహించే అసెస్మెంట్ టెస్టుల ద్వారా,ట్యాబ్ లలో ఆన్లైన్ పరీక్షలు రాయడంపై అవగాహన లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు విద్యార్థులు మరియు తల్లిదండ్రులు తెలియజేస్తున్నారు. అదేవిధంగా మారుమూల ప్రాంతాలలో ఇంగ్లీష్ పరిజ్ఞానం లేక,ఈ సిలబస్ పై సరైన అవగాహన లేక ఈ సెంట్రల్ సిలబస్ అభ్యసించడం కష్టతరమవుతుందని విద్యార్థులు తెలియజేస్తున్నారు.విద్యార్థులలో ఉండే ప్రతిభను వెలికితీయడానికి ప్రభుత్వం ఈ ఆన్లైన్ పరీక్షలను నిర్వహిస్తుంది.కానీ ఈ ఆన్లైన్ పరీక్షలు రాయడానికి కావలసిన ట్యాబులు సక్రమంగా పనిచేయడం లేదని,ట్యాబులలో ఆన్లైన్ పరీక్ష రాయడంపై విద్యార్థులకు అవగాహన లేక వారు ఇబ్బందులకు గురవుతున్నట్లు తల్లిదండ్రులు తెలియజేస్తున్నారు. పెండేకల్ ఆర్.ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు 147,జొన్నగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు 146 మంది పదవ తరగతి విద్యార్థులు సీబీఎస్సీ విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలల యందు ఆన్లైన్ పరీక్షలు నిర్వహించడానికి సరైన ట్యాబులు లేక, సరైన ఇంటర్నెట్ వసతి లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విద్యను బోధించే ఉపాధ్యాయులకు కూడా ప్రభుత్వం ఆన్లైన్ పరీక్ష విధానంపై ఎటువంటి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయకుండా,నేరుగా విద్యార్థులకు ఆన్లైన్ పరీక్షలను నిర్వహించడం ద్వారా ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందని తల్లిదండ్రులు తెలియజేస్తున్నారు.ఆన్లైన్ పరీక్ష రాసే సమయంలో వచ్చే సాంకేతిక లోపాల వలన విద్యార్థులు,సాంకేతిక లోపాలను సరిచేసే అవగాహన లేక ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారని తల్లిదండ్రులు తెలియజేస్తున్నారు.కావున మొదటగా ఉపాధ్యాయులకు ఆన్లైన్ పరీక్ష నిర్వహణపై అవగాహనను కల్పించాలని తల్లిదండ్రులు తెలియజేస్తున్నారు.అదేవిధంగా గత ప్రభుత్వంలో ఇచ్చిన ట్యాబ్ లు సక్రమంగా పనిచేయక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆన్లైన్ పరీక్షలను సక్రమంగా నిర్వహించలేకపోతున్నారని పలువురు విద్యార్థులు మరియు తల్లిదండ్రులు తెలియజేస్తున్నారు.ఈ అసెస్మెంట్ టెస్ట్ ల ద్వారా విద్యార్థులు సరిగ్గా విద్యను అభ్యసించలేకపోతున్నారని తల్లిదండ్రులు తెలియజేస్తున్నారు.ఈ ఆన్లైన్ టెస్ట్ ల ద్వారా సమయం వృధా అవ్వడమే కాక,విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని తల్లిదండ్రులు తెలియజేస్తున్నారు.ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం అందించే నిర్వాహన ఖర్చులు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రభుత్వ పాఠశాలలో వసతులు సరిగ్గా లేవని తల్లిదండ్రులు తెలియజేస్తున్నారు.అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల త్రాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన ఆర్.ఓ ప్లాంట్ లు పూర్తిగా పనిచేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు తెలియజేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అర్థమయ్యే స్టేట్ సిలబస్ ను విద్యార్థులకు బోధించాలని తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ఖమ్మంలో దారుణం

**మనవడిని అమ్మేసిన నాయనమ్మ**
**పోలీసుల జోక్యంతో కథ సుఖాంతం**



**ఖమ్మం :** ఖమ్మం జిల్లాలో దారుణం జరిగింది. దత్తత పేరుతో బాలుడిని అమ్మిన నాయనమ్మ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఖమ్మం నగరం నిజంపేటకు చెందిన పందుల సాయి, స్వప్న 2021లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు.ఈ దంపతులకు 2022 డిసెంబర్ లో బాబు పుట్టాడు. బాబు పుట్టిన నెల రోజులకే 2023 లో సాయి రోడ్డు ప్రమాదంలో మరణించాడు ..ఆతరువాత. నాయనమ్మ నాకు వున్న ఒక్క కొడుకు చనిపోయాడు. ఈ బాబును నాకు ఇవ్వు నా కొడుకును మనవడిలో చూసుకుంటా అని చెప్పి స్థానిక 42 డివిజన్ కార్పొరేటర్ భర్త శేషగిరి రావు సమక్షంలో బలవంతంగా దత్తత కు ఒప్పించారు. అయితే 10 రోజులు గడవక ముందే మీ అత్త వేరే వారికి దత్తత ఇస్తుంది అట వచ్చి సంతకం పెట్టీ పో అని శేషగిరి రావు చెప్పారు. మా అత్త పెంచుకుంటుందని దత్తత స్వీకరించింది. మళ్లీ వేరే వాళ్లకు ఇవ్వటం ఏమిటి అనే ప్రశ్నించిన స్వప్న దాంతో ఆడబిడ్డ భర్త శేషగిరిరావు అమ్మాయిని సంతకం పెట్టాలని ఒత్తిడి చేయడం జరిగింది. ఆ బాబును చూపెట్టండి అని అడిగిన చూపెట్టడం లేదు నా బాబుని వేరే వాళ్లకు అమ్మినట్టు తెలిసింది.ఇదే విషయం అడుగుతే ముందు సంతకం పెట్టు. నువ్వు ఎక్కడైనా దిక్కున్న దగ్గర చెప్పుకో అని బెదిరించడం జరిగింది. నా బాబు నాకు కావాలి అని రోదిస్తున్న తల్లి స్వప్నతీరు పలువురిని కంటతడి పెట్టించింది. పోలీసుల రంగప్రవేశం చేసి ఈ రోజు బాబును తెప్పించిన అత్త నాగమణి, పోలీస్ స్టేషన్లో తల్లి స్వప్న బాబును లాక్కునేందుకు కొంత పెనుగులాట జరిగింది. చివరకు బాబును శిశు సంక్షేమ అధికారులవద్దకు పంపి వారి సమక్షంలో తల్లికి అప్పజెప్పరు.

# వైద్యులకు అండగా వుంటాం డాక్టర్లకు మంత్రి సీతక్క సంఘీభావం

**హైదరాబాద్ :** కోల్కతాలో మహిళ వైద్యురాలి హత్యాచారంపై గాంధీ ఆసుపత్రిలో నిరసన చేపట్టిన డాక్టర్లకు మంత్రి సీతక్క సంఘీభావం ప్రకటించారు. సీతక్క మాట్లాడుతూ కోల్కతా ఘటనగ్ర్భాంతికి గురిచేసింది. మహిళలపై అఘాయిత్యాలు నిలువరించాలి. మహిళా దేవతతో సమానం. ఇప్పుడిప్పుడే మహిళలు బయటకి వస్తున్నారు. ఇలాంటి ఘటనలు మహిళలను మధ్య యుగాలకు తీసుకువెళ్తుందని అన్నారు. కలకత్తా లో వైద్యురాలిపై హత్యాచారం హేయం. వైద్యులకు అండగా మేము నిలబడతాము. తరగతి గదుల నుంచి మహిళలను గౌరవించాలి అని నేర్పిస్తాం. తప్పు చేసిన వారు ఎవరైనా ఉపేక్షించకూడదు. మహిళా రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. మహిళా భద్రత పై ప్రతి ఒక్కరి ఆలోచన మారాలి.. అందుకోసం కృషి చేస్తాం. డ్రగ్స్ నియంత్రణకు మా ప్రభుత్వం కట్టుబడింది. అలాగే మహిళా భద్రత పై కూడా పూర్తి స్థాయిలో కృషి చేస్తాం. కఠినమైన చట్టాలను అమలు చేయడంతో పాటు ఇలాంటివి జరగకుండా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తాం. సీఎం రేవంత్ రెడ్డి తో కలిసి మహిళా భద్రతకు కృషి చేస్తాం. వైద్యుల భద్రత మనందరి బాధ్యత. బాధితుల కుటుంబాలకు అన్నిరకాలుగా న్యాయం జరగాలి. పని ప్రదేశాల్లో భద్రత చాలా ముఖ్యం. దాని కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు.

# జాతీయవాదం, దేశసమగ్రతను పెంపొందిచడానికె హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**మంథని :** జాతీయవాదం, దేశసమగ్రతను పెంపొందిచడా నికె హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించినట్లు బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి తెలిపారు.బుధవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో సుమారు వేయి మంది విద్యార్థులతో హర్ ఘర్ తిరంగా భారీ ర్యాలీ నిర్వహించారు.బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, రాష్ట్ర నాయకులు చల్ల నారాయణ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొండాపాక సత్యప్రకాష్ లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సమగ్రతను, జాతీయ వాదాన్ని, ఐక్యతను కాపాడేందుకు ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీలను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఈ మూడు రోజులు మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ వారి విగ్రహాలను శుద్ధి చేస్తూ, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ భావం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ దేశాలలో భారతదేశాన్ని స్వేచ్ఛ స్వాతంత్ర్యాలకు నిలయంగా మోడీ పరిపాలన కొనసాగిస్తున్నారని కాశ్మీర్ లాంటి సమస్యాత్మక ప్రాంతాల్లో కూడా మోడీ పాలనలో స్వేచ్ఛగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమలను నిర్వహించడం జరుగుతుందన్నారు. బంగ్లాదేశ్ హిందువులపై జరుగుతున్న దాడిని కాంగ్రెస్ పార్టీ ఖండించకపోవడం వారి ఓటు బ్యాంకు రాజకీయాలకు నిదర్శనం అన్నారు

## మతోన్మాదానికి నిరసనగా 16న బంద్


**వ్యాపార వాణిజ్య ఐఖ్యవేదిక పిలుపు**

**పెద్దపల్లి :** బంగ్లాదేశులోని హిందువుల పట్ల అక్కడి ముస్లీం చాందసవాదులు జరుపుతున్న దారుణాలను పెద్దపల్లి వ్యాపార, వాణిజ్య సంఘం ఐఖ్యవేధిక నాయకులు ముక్త కంఠముతో ఖండించారు. ఘోరకలికి నిరసనగా ఈ నెల 16న పెద్దపల్లి స్వచ్ఛంద బందుకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక కన్వీనర్ కావేటి రాజగోపాల్ మాట్లాడుతూ, బంగ్లాదేశ్ హిందువులకు అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. హిందువులను టార్గెట్ చేసి చంపడం, మహిళలపై అత్యాచారాలు చేస్తూ వీడియోలు తీసి వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేయడం ఏ మత ఆచారమో చెప్పాలని అక్కడి ముస్లీములను ప్రశ్నించారు.

## యూత్ కాంగ్రెస్ సభ్యత్వ నమోదు ప్రారంభం

**మంథని :** యువజన కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు,దుద్దిల్ల శీనుబాబు ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎరుకల ప్రవీణ్ ఆధ్వర్యంలో బుధవారం మంథని పట్టణంలో ప్రారంభించారు. మంథని పట్టణంలోని మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నివాసంలో సమావేశాన్ని నిర్వహించి యూత్ కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎరుకల ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన యూత్ కాంగ్రెస్ సభ్యత్వాలు అధిక మొత్తంలో నమోదు చేసి మంత్రి శ్రీధర్ బాబు,యువ నాయకులు శ్రీను బాబు బలపరిచిన అభ్యర్థులను తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ( అభ్యర్థి ) సీరియల్ నంబర్ 1, తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బండ కిషోర్ రెడ్డి ( అభ్యర్థి ) సీరియల్ నంబర్ 43, యూత్ కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు బొంకూరి అవినాష్ ( అభ్యర్థి ) సీరియల్ నంబర్02, యూత్ కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నూకల కమల్ ( అభ్యర్థి ) సీరియల్ నంబర్ 06, మంథని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీమల సందీప్ ( అభ్యర్థి )సీరియల్ నంబర్ 03, మంథని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాదుల శ్రీకాంత్ ( అభ్యర్థి )

# జనరల్ న్యూస్





## 17న ఫౌజీ ఫస్ట్ లుక్ పోస్టర్!

రెబల్ స్టార్ ప్రభాస్ టాలీవుడ్ ఇండస్ట్రీలో దర్శకుడిగా మంచి గుర్తింపును సంపాదించుకున్న వారిలో ఒకరు అయినటువంటి హను రాగవపూడి దర్శకత్వంలో ఫౌజీ అనే టైటిల్‌తో ఓ మూవీ చేయబోతున్న విషయం మన అందరికీ తెలిసిందే.ఈ మూవీ లో మోస్ట్ బ్యూటిఫుల్ నటిమని మృణాల్ ఠాగూర్ , ప్రభాస్ కి జోడిగా నటించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా రజాకార్ బ్యాక్ డ్రాప్‌లో ఉండబోతున్నట్లు సమాచారం. ఇప్పటికే ప్రభాస్మూవీ సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులను హను రాగవపూడి చాలా రోజుల క్రితమే ప్రారంభించాడు. ప్రభాస్ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులను పక్కాగా ఇప్పటికే హను రాఘవపూడి పూర్తి చేసుకున్నట్లు తెలుస్తోంది. దానితో మరికొన్ని రోజుల్లోనే ఈ సినిమా షూటింగ్ కూడా స్టార్ట్ చేయబోతున్నట్లు సమాచారం. ఇకపోతే ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం హను రాఘవపూడి సినిమాకు సంబంధించిన ప్రభాస్, మృణాల్ ఠాకూర్ ఫస్ట్ లుక్ పోస్టర్ లను విడుదల చేయడానికి రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఫౌజీ మూవీ నుండి ప్రభాస్ , మృణాల్ ఫస్ట్ లుక్ పోస్టర్ లను ఆగస్టు 17 వ తేదీన విడుదల చేసే ఆలోచనలో ఈ మూవీ మేకర్స్ ఉన్నట్లు అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన మరికొన్ని రోజుల్లోనే విడుదల అయ్యే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇకపోతే హను రాఘవపూడి ఆఖరుగా సీత రామం అనే సినిమాకు దర్శకత్వం వహించాడు. ఈ మూవీ అద్భుతమైన విజయం అందుకుంది. ఈ సినిమాలో దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన మృణాల్ ఠాగూర్ హీరోయిన్ గా నటించింది. ఈ మూవీ తోనే మృణాల్ తెలుగు తెరకు పరిచయం అయింది. ఈ సినిమాతోనే ఈ బ్యూటీ తెలుగు సినీ పరిశ్రమలో అద్భుతమైన గుర్తింపును కూడా సంపాదించుకుంది.

## హీరోయిన్‌కి లేని బాధ మీకెందుకు?



మాస్ మహారాజా రవితేజ, హరీష్ శంకర్ కాంబో మూవీ 'మిస్టర్ బచ్చన్' అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ప్రతిష్టాత్మకమైన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టి.జి.విశ్వ ప్రసాద్ ఈ సినిమాని నిర్మించారు. మిస్టర్ బచ్చన్ లో రవితేజకు జోడిగా భాగ్యశ్రీ బోర్సే నటించగా ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున విడుదల కానుంది. ఆగస్టు 14 సాయంత్రం నుంచి ప్రీమియర్స్ ఉండబోతున్నాయి. ఈ నేపథ్యంలో డైరెక్టర్హరీష్ శంకర్హరీష్ శంకర్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.రవితేజ నటిస్తున్న 'మిస్టర్ బచ్చన్' నిర్మాతలు భాగ్యశ్రీ బోర్స్‌ను మహిళా ప్రధాన పాత్రగా ప్రకటించినప్పటి నుండి ప్రధాన జంట మధ్య వయస్సు అంతరం గురించి లెక్కలేనన్ని ట్రోల్స్ వచ్చాయి. ఆసక్తికరమైన విషయమేమిటంటే, మిస్టర్ బచ్చన్ హీరో మరియు హీరోయిన్ మధ్య పెద్ద వయస్సు గ్యాప్ ఉన్న మొదటి చిత్రం కాదు కానీ ట్రోలర్లు హద్దులు దాటారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో దర్శకుడు ట్రోల్స్‌కు స్టైల్‌గా సమాధానమిచ్చాడు.రీసెంట్ గా మరో యంగ్ హీరోయిన్భాగ్యశ్రీ బోర్స్ విషయంలో కూడా చాలా ట్రోల్స్ పడ్డాయి. ఇలా రవితేజ అండ్ హీరోయిన్స్ విషయంలో నడుస్తున్న కాంట్రవర్సియల్ ట్రోల్స్ పట్ల తాజాగా తన దర్శకుడు హరీష్ శంకర్ అయితే ఆ ట్రోల్స్ చేస్తున్న వారిపై ఫైర్ అయ్యారు. అసలు వారికేం తెలుసని మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. అసలు సినిమాకి వయసుకి సంబంధం ఏముంటుంది అని సినిమాలో హీరో, హీరోయిన్స్ పై స్క్రీన్ ఏజ్ అనేది ఎప్పుడు కరెక్ట్ గానే తీసుకుంటాం. అసలు ఒక హీరో లేదా హీరోయిన్ బయట ఒక ఏజ్ ఉంటే సినిమాలో కూడా ఆ ఏజ్ లోనే కనిపిస్తారని ఎలా అనుకుంటున్నారు? మినిమమ్ కామన్ సెన్స్ లేదేంట్రా మీకు అంటూ ఫైర్ అయ్యారు. అయినా ఒక హీరోయిన్ అన్నీ తెలిసే ఒక సినిమా ఓకే చేసి సంతకం పెట్టినపుడు వాళ్ళకి లేని ప్రాబ్లమ్ మీకేంటి అసలు అసలు అని హరీష్ తన మార్క్ ఫైర్ ఆన్సర్ ఇచ్చారు. ధమాకా హిట్టయింది కాబట్టి చిన్న పిల్లని పెట్టారు కాబట్టి సక్సెస్ అయ్యింది అని అంటారా? సక్సెస్ అయ్యిన తర్వాత ఏజ్ కోసం మాట్లాడలేదు ఇలా హిట్టయ్యాక ఒక మాట హిట్ కాకపోతే ఒక మాట్లాడ్డం కరెక్ట్ కాదని హరీష్ అయితే ఏజ్ విషయంలో నడుస్తున్న కొన్ని కాంట్రవర్సీలు కొన్ని ట్రోల్స్ పై మాత్రం గట్టి సమాధానం ఇచ్చేసారు. దీంతో ఈ కామెంట్స్ పట్ల రవితేజ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఇప్పుడు వీరి కాంబినేషన్ లో వస్తున్న మిస్టర్ బచ్చన్ ఈ ఆగస్ట్ 15న విడుదల కాబోతుంది. ఈ చిత్రాన్ని టిజి విశ్వప్రసాద్ నిర్మాణం వహించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో దర్శకుడు ట్రోల్స్‌కు స్టైల్‌గా సమాధానమిచ్చాడు. ఏజ్ గ్యాప్ గురించిన గొడవ నాకు అర్థం కావడం లేదు.



## ఆయన్ను చూసి అవాక్కవుతున్నారట

90ల్లో చిరంజీవి లుక్‌ని ఆనాటి యూత్ ఓ రేంజ్‌లో ఆరాధించారు. అప్పట్లో ఆయన హెయిర్ ట్కస్టైల్‌నీ.. ఆయన డ్రెస్సింగ్ ట్కస్టైల్‌నీ ఫాలో అవ్వని కుర్రాడు లేడు.సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదల కానున్న 'విశ్వంభర'లో మెగాస్టార్ మళ్లీ అలా కనిపించనున్నారట. ఈ లుక్ కోసం ఆయన భారీగా బరువు తగ్గడం విశేషం. అంతేకాదు, ఆనాటి హెయిర్ ట్కస్టైల్‌ని సరిగ్గా అలాగే డిజైన్ చేయించారట దర్శకుడు వశిష్ఠ.లొకేషన్లో అందరూ అప్పటి చిరంజీవిని చూస్తున్న ఫీల్‌ని ఎంజాయ్ చేస్తున్నారట. ప్రస్తుతం హైదరాబాద్ అన్నపూర్ణ ఏడెకరాల్లో ఈ సినిమాకు సంబంధించిన డబ్బింగ్ కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి. తన పాత్రకు డబ్బింగ్ చెప్పేందుకు వచ్చిన చిరంజీవిని చూసి అక్కడందరూ షాక్‌కి గురవుతున్నారట. ఈ నెల 22న చిరంజీవి పుట్టిన రోజు కానుకగా ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేయనున్నారు. టీజర్ కట్ ఇప్పటికే పూర్తయింది. కీరవాణి నేపథ్య సంగీతం, ఫైనల్ ఎడిట్ మాత్రమే మిగిలివుంది. ఈ టీజర్‌లో చిరు లుక్, విజువల్స్, వశిష్ఠ ఆవిష్కరించిన కొత్త లోకాలు.. ఆడియన్స్‌ని కట్టిపడేస్తాయని సమాచారం.



## కొత్త ప్రపంచాన్ని చూపిస్తుంది

విక్రమ్ హీరోగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. పా రంజిత్ దర్శకుడు. నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాష్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ, 'ఇది ఇండియానా జోన్స్ వంటి భారీ మూవీ. ట్రైబల్ నేపథ్యంగా ప్రీ ఇండిపెండెన్స్ టైమ్‌లో జరిగే స్టోరీ ఇది. ఒరిజినల్‌గా, ఆ కథా నేపథ్యానికి తగినట్లు మ్యూజిక్ క్రియేట్ చేశాను. ఈ సినిమా కోసం 50 రోజులు రీ రికార్డింగ్ చేశాను. దర్శకుడు పా రంజిత్ విజన్‌ను అర్థం చేసుకుని అందుకు తగినట్లు మ్యూజిక్ అందించాను. సంగీత దర్శకుడిగా ఈ సినిమాకి వర్క్ చేయడం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది. టైటిల్ సాంగ్, మనకి మనకి సాంగ్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. పాటలే కాదు బీజీఎం కూడా చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది. ఈ కథలో ప్రేమ, కుట్ర, పోరాటం, కోపం వంటి ఎన్నో ఎమోషన్స్ ఉన్నాయి. వాటిని ఎలివేట్ చేసేలా, మరింతగా ప్రేక్షకులకు ఎఫెక్టీవ్‌గా రీచ్ చేసేలా బీజీఎం చేశాను. విక్రమ్ ఈ సినిమా కోసం మారిపోయిన తీరు ఆశ్చర్యపరిచింది. ఇందులో ఫీమేల్ ఓరియెంటెడ్ క్యారెక్టర్స్ చాలా స్ట్రాంగ్‌గా ఉంటాయి. పార్వతీ తిరువోతు, మాళవిక ది బెస్ట్ పర్ ఫార్మెన్స్ ఇచ్చారు. ఈ సినిమా ప్రేక్షకులకు ఒక కొత్త ప్రపంచాన్ని చూపిస్తుంది. ఏఐ సహా ఎన్నో కొత్త టెక్నాలజీలు మనకు అందుబాటులోకి వస్తున్నాయి. అయితే టెక్నాలజీపైనే ఆధారపడటం సరికాదు. ఎంతవరకు ఉపయోగించుకోవాలి అనే ఐడియా ఉండాలి' అని తెలిపారు.

## తల్లి కోరికను నెరవేర్చిన జాన్వీ కపూర్



టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లో అతిలోకసుందరిగా పేర్కొంది దివంగత హీరోయిన్ శ్రీదేవి.. ఈమె గురించి ఎంత చెప్పినా కూడా తక్కువే తన అందంతో నటనతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది.. ఈ రోజున శ్రీదేవి బర్తడే సందర్భంగా ఆమె గురించి కొన్ని విషయాలు అయితే అభిమానులు వైరల్ గా చేస్తున్నారు. అయితే శ్రీదేవి మరణం కూడా అనుమానాస్పదంగా బాత్ టబ్లో మరణించిన సంగతి కూడా అందరికీ తెలిసిందే.. ఈ విషయాన్ని అభిమానులు ఇంకా జీర్ణించుకోలేకపోతున్నారు.ఇక ఆమె వారసురాలుగా పెద్ద కుమార్తె జాన్వీ కపూర్ హీరోయిన్గా ఎంట్రీ ఇచ్చింది. ఇక తన తల్లిలాగే పోలికలతో ఉండడంతో ఈ ముద్దుగుమ్మకు బాగా కలిసొచ్చిందని కూడా చెప్పవచ్చు. సోషల్ మీడియాలో తరచూ యాక్టివ్ గా ఉండడమే కాకుండా బాలీవుడ్టాలీవుడ్ లో పలు సినిమాలలో నటిస్తోంది. టాలీవుడ్ లో ఎన్టీఆర్ నటిస్తున్న దేవర చిత్రంలో పాట రామ్ చరణ్ తో ఒక సినిమాలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే శ్రీదేవి ఆమె కూతురు జాన్వీ కపూర్ కు సంబంధించి ఒక న్యూస్ వైరల్ గా మారుతున్నది.. అదేమిటంటే జాన్వీ తన తల్లి శ్రీదేవి మరణం తర్వాత ఒక పని చేయనని మాట ఇచ్చిందట. ఆ మాట ఏమిటంటే జాన్వీ కి స్మోకింగ్ చేసి అలవాటు చాలా ఎక్కువగా ఉండేదట. ఈ విషయం పైన తన తల్లి ఎన్నోసార్లు ఈ అలవాటు మానేయమని సలహా ఇచ్చినా కూడా మానలేదట. కానీ శ్రీదేవి మరణించిన తర్వాత మాత్రం ఆమె చివరి కోరికగా ఇది భావించిన జాన్వీ కపూర్ స్మోకింగ్ మానేసినట్లుగా ఒక న్యూస్ అయితే ఇప్పుడు వైరల్ గా మారుతున్నది. అంతేకాకుండా తన తల్లి మీద ఉండే ప్రేమని జాన్వీ కపూర్ ఎన్నోసార్లు తెలియజేసింది.. తన తల్లి కోరిక మీదకి జూనియర్ ఎన్టీఆర్‌తో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చినట్లుగా కూడా తెలియజేసింది ఈ ముద్దుగుమ్మ.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110